

యుఫోరియా మ్యూజికల్ నైట్‌కు హాజరైన జనం



తమన్ మ్యూజికల్ షో



వేదిక వద్దకు వస్తున్న చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు, పవన్, లోకేశ్



యువత కేరింతలు



నృత్య ప్రదర్శన

తలసేమియా బాధితుల సహాయార్థం ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి నిర్వహించిన యుఫోరియా మ్యూజికల్ నైట్ కుర్రకారులో జోష్‌ను నింపింది. విజయవాడ నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో తమన్, శివమణి, నవీన్ నేతృత్వంలో గాయనీ గాయకులు వీనులవిందుగా సినీ గీతాలను ఆలపించారు. పవన్ కల్యాణ్, బాలకృష్ణ సినిమాల్లోని గీతాలకు యువత నుంచి విశేష స్పందన లభించింది. బాలకృష్ణ సినిమాలోని 'మొన్నా కుట్టేసినది నిన్న కుట్టేసినది.. మళ్లీ కుట్టేసినది గండు సీమ' అనే పాట కుర్రకారును ఉర్రూతలూగించింది. మిరుమిట్లు గొలిపే విద్యుత్ కాంతుల నడుమ ఆద్యంతం కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ భువనేశ్వరి, సినీ హీరో, ఎమ్మెల్యే బాలకృష్ణ హాజరయ్యారు. -ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీలైఫ్

అరాచకాలు చేసి.. 'పెడబొబ్బలు

వైసీపీ నేతల తీరుపై సర్వత్రా విమర్శలు

అధికారంలో ఉండగా రెచ్చిపోయిన వంశీ, కొడాలి, పేర్ని, జోగి

వైసీపీ నేతలు వల్లభనేని వంశీ, పేర్ని నాని, కొడాలి నాని, జోగి రమేష్ అధికారాన్ని అడ్డంపెట్టుకుని ఐదేళ్ల పాటు అనేక అరాచకాలకు పాల్పడ్డారు. వాటి ఫలితంగా నేడు కేసులు నమోదు, అరెస్టులు జరుగుతుంటే గగ్గోలు పెడుతున్నారు. అధికారం ఉందని అరాచకాలు చేస్తున్నారంటూ కూటమి ప్రభుత్వంపై ఎదురు దాడి చేస్తున్నారు. వంశీ అరెస్టుపై మెలమెల్లగా వైసీపీ నేతలు స్వరం పెంచుతున్నారు. తప్పుడు కేసు పెట్టారని, రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ కూడా వంశీ విషయంలో చంద్రబాబు తీవ్ర అన్యాయం చేస్తున్నారంటూ మండిపడుతున్నారు. తప్పులు చేసిన వారిని వైసీపీ నేతలు వెనకేసుకురావటం ప్రజల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

-ఆంధ్రజ్యోతి, విజయవాడ

- వాటి ఫలితంగా నేడు కేసులు, అరెస్టులు జరుగుతుంటే గగ్గోలు
- టీడీపీలో ఉండగా వంశీ అరాచవాది.. వైసీపీలోకి రాగానే మానవతావాది
- వైసీపీ అధినేత జగన్ ద్వంద్వ వైఖరిపై ప్రజాగ్రహం
- నాటి పాపాల ఫలితమేనంటున్న గన్నవరం నియోజకవర్గ వాసులు



నాడు చెడ్డవాడు.. నేడు మంచివాడు

వల్లభనేని వంశీ అక్రమాలపై నాడు ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్ అనేక ఆరోపణలు చేశారు. పాదయాత్రలో తోటపల్లి వచ్చినప్పుడు బ్రహ్మయ్య లింగం చెరువుతో పాటు కొండలను కరిగించేశాడని విరుచుకుపడ్డారు. 2019 ఎన్నికల ముందు వంశీ క్వారీలు మింగేశాడని ఆయన అరాచకాలపై జగన్ పత్రిక పతాక శీర్షికన పెద్ద కథనమే ప్రచురించింది. అధికారంలోకి వచ్చిన తర్వాత గన్నవరం నియోజకవర్గంలో నకిలీ ఇళ్ల పట్టాలను పంపిణీ చేయించారని వైసీపీ ప్రభుత్వం కేసు పెట్టించింది. వంశీ జగన్ పంచన చేరగానే ఆ కేసును మూలన పడేసింది. ఇప్పుడు వంశీ అక్రమాలను కప్పిపెడుతూ అన్యాయంగా, అక్రమంగా కేసులు పెడుతున్నారని జగన్ ట్వీట్లు పెడుతున్నారు. వంశీ చేసిన అరాచకాల నేపథ్యంలో గన్నవరం నియోజకవర్గంలో ఆయన్ను అక్కడి ప్రజలు చిత్తుగా ఓడించారు. వంశీ అరెస్టు విషయంలో ప్రజల నుంచి ఎలాంటి సానుభూతి రాలేదు.

వైసీపీ అధికారంలోకి రాగానే జిల్లా పరిషత్‌పై దాడి

వైసీపీ అధికారంలోకి వచ్చీరాగానే ఆ పార్టీ తొలి దాడి ఉమ్మడి కృష్ణాజిల్లాలోని జిల్లా పరిషత్‌పై మాజీ మంత్రి పేర్ని నాని పథక రచనతో జరిగింది. టీడీపీ అధికారంలో ఉన్నపుడు అప్పటి చైర్‌పర్సన్ గద్దె అనురాధ జెడ్పీ ఆవరణలో ఫంక్షన్ హాల్‌ను కట్టించారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రాకముందే ఆమె దానిని ప్రారంభించారు. దీనికి గుర్తుగా అప్పట్లో శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. వైసీపీ అధికారంలోకి రాగానే పేర్ని నాని ప్రోద్బలంతో జెడ్పీ ఫంక్షన్ హాల్‌పై దాడి చేసి శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. దీనిపై అప్పట్లో టీడీపీ నాయకులు చిలకలపూడి పోలీస్ స్టేషన్‌లో కేసు కూడా పెట్టారు. అధికారం అండతో ఈ కేసును ముందుకు కదలకుండా చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చినా అక్కడి నేతలు ఎవ్వరూ కూడా ఈ కేసుపై మాట్లాడలేదు. పేర్ని నానిపై రాజకీయ కక్షకు దిగాలంటే ఈ కేసును రీ ఓపెన్ చేస్తే చాలు. ఇప్పటికే ఆయన గోడౌన్‌లోని రేషన్ బియ్యం మాయం చేయడంపై కేసు నమోదైంది. దీనిపై పేర్ని నాని నానా గొడవ చేశారు. ఈయన పరిస్థితి ఇలా ఉంటే.. నాని తనయుడు

మిగతా 6లో..

దాడులు చేసిన వారిని ప్రోత్సహించినందునే మరిన్ని దాడులు

ప్రభుత్వంలో ఉన్న వారు శాంతిభద్రతలను కాపాడాలి. అలాంటిది వైసీపీ ప్రభుత్వంలో దాడులకు పాల్పడేవారిని హీరోలుగా చూస్తూ వారికి ప్రోత్సాహకాలు ఇస్తుండటంతో మిగిలిన వారు కూడా ఇదే పంథాలో ముందుకు సాగారు. వల్లభనేని వంశీ కూడా ఇదే స్ఫూర్తితో టీడీపీ కార్యాలయంపై దాడికి పథక రచన చేశారు. మరో మాజీ మంత్రి కొడాలి నాని కూడా అప్పట్లో తన అనుయాయుల ద్వారా టీడీపీ నాయకుడు రావి వెంకటేశ్వరరావు వర్గీయులపై దాడులకు తెగపడ్డారు. రావి ఏర్పాటు చేసిన టీడీపీ కార్యాలయంపైనా దాడులకు పాల్పడేంత వరకు పరిస్థితి వెళ్లింది.

జీబీఎస్ కేసు

పాత ప్రభుత్వ ఆస్పత్రిలో ఐదేళ్ల బాలికకు చికిత్స

ఏలూరు జిల్లా ఎర్రగుంటపల్లి బాలికకు వైరస్

కోలుకుంటోందని చెప్పిన సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు

వన్‌టౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) కేసు విజయవాడలో వెలుగు చూసింది. ఏలూరు జిల్లా చింతలపూడి మండలం ఎర్రగుంటపల్లి గ్రామానికి చెందిన బాలిక(5) ఈ వ్యాధితో బాధపడుతుండగా.. విజయవాడలోని పాత ప్రభుత్వాస్పత్రికి తల్లిదండ్రులు తీసుకువచ్చారు. బాలిక ఇప్పుడు చికిత్స పొందుతూ కోలుకుంటోందని ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎ.వెంకటేశ్వరరావు శనివారం 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. బాలికకు తొలుత జ్వరం వచ్చిందని స్థానిక ఆస్పత్రిలో చూపించగా, మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలించాలన్న సూచనతో ప్రభుత్వ పాత ఆస్పత్రితో చేరింది. ఇక్కడి వైద్యులు పరీక్షించగా గులియన్ బారే సిండ్రోమ్‌కు గురైందని తేలింది. దీంతో బాలికకు అవసరమైన చికిత్సలు అందిస్తున్నారు. ఇది అంటువ్యాధి కాకపోవటంతో జనరల్ వార్డులోనే ఉంచి చికిత్స చేస్తున్నా

ఇది అంటువ్యాధి కాదు.. భయపడవద్దు

గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) అంటు వ్యాధి కాదు.. ఇది కేవలం బ్యాక్టీరియా.. జ్వరం వచ్చినప్పుడు డయేరియా కూడా రాకుండా చూసుకోవాలని పాత ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు చెబుతున్నారు. డయేరియా కారణంగా కండరాల బలహీనత, తిమ్మిర్లు, నడవలేకపోవటం, ఆహారం మింగుడుపడకపోవటం, శ్వాస ఆడకపోవటం వంటి లక్షణాలు జీబీఎస్‌లో వస్తాయని చెప్పారు. జీబీఎస్ వచ్చిన వారికి ప్రాణ హాని ఉండదని, పాపకు మెరుగైన చికిత్స అందిస్తున్నామని తెలిపారు. బాలిక ఆసుపత్రిలో చేరినప్పుడు నడవలేని స్థితిలో వచ్చిందని, మెరుగైన చికిత్స అందించటంతో ఆరోగ్యం కుదుటపడిందని తెలిపారు. ఈ వైరస్ గురించి ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఇది అంటువ్యాధి కాదని మరోసారి స్పష్టం చేశారు.

పాత ప్రభుత్వాసుపత్రిలో ట్రీట్మెంట్‌కు ఏర్పాట్లు

జీబీఎస్ కేసులకు సత్వర అత్యున్నత వైద్యం అందించటానికి విజయవాడ పాత ప్రభుత్వాసుపత్రిలో అన్ని ఏర్పాట్లు చేశామని వెంకటేశ్వరరావు చెప్పారు. ఇలాంటి కేసుల పట్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.



టీడీపీ ప్రభుత్వంలో నార్తువల్లూరు ప్రభుత్వ క్వారీలో ట్రాక్టర్లలోకి ఇసుక పోస్తున్న కార్మికులు(ఫైల్)

ఇసుక క్వారీల్లో ఇక యంత్రాలు!

ప్రజాభిప్రాయ సేకరణ సదస్సుల్లో స్పష్టం చేసిన అధికారులు

ఇసుక క్వారీల్లో యంత్రాల వినియోగం ఇక తథ్యమని స్పష్టమైంది. రెండు నెలలుగా ఇసుక లోడింగ్‌తో జీవనోపాధి పొందిన కార్మికులు ఇక పని కోసం పరుగులు పెట్టాల్సిన పరిస్థితి రానుంది. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మైనింగ్‌శాఖ ఈ నెల 10, 11 తేదీల్లో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ సదస్సుల్లో మినీ మిషన్స్(చిన్న జేసీబీ)లను ఉపయోగిస్తామని అధికారులు స్పష్టం చేశారు. టిప్పర్లలో జేసీబీతో ఇసుక లోడింగ్ చేసినా ఇతర కార్యకలాపాలకు ఒక్కో క్వారీలో 22 మందికి ఉపాధి లభిస్తుందని వెల్లడించారు. దీంతో కార్మికులు యంత్రాలు వద్దని, ఎంత ఇసుక కావాలన్నా మేమే లోడింగ్ చేస్తామని అధికారులకు అర్జీలు అందించారు. కాని ప్రభుత్వం యంత్రాలను ప్రవేశపెట్టాలని ఒక నిర్ణయం తీసుకున్నట్టుగా అధికారులు ప్రకటించేశారు. దీనిపై పోరాటం చేసేందుకు కార్మికులు సిద్ధమవుతున్నట్టు సమాచారం. ఇది భవిష్యత్తులో ప్రభుత్వానికి తలనొప్పిగా మారే ప్రమాదం ఉంది.

- ఒక్కో క్వారీలో 22 మంది కార్మికులకు ఉపాధి లభిస్తుందని హామీ
- కార్మికుల్లో మొదలైన అలజడి.. పోరాటానికి సన్నద్ధం!
- రెండు నెలలుగా ఇసుక లోడింగ్‌తో జీవనోపాధి పొందిన కార్మికులు

ఆంధ్రజ్యోతి-తోట్లవల్లూరు: తోట్లవల్లూరు మండలంలో ఈ నెల 6వ తేదీ వరకు నడిచిన క్వారీల్లో కార్మికులు మాత్రమే ఇసుక లోడింగ్ చేయాలని జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధన ఉన్నప్పటికీ కాంట్రాక్టర్లు యంత్రాలను ఉపయోగించి కార్మికులకు రోజువారి రూ.40 వేలు ప్యాకేజీ ఇచ్చారు. అలాగే కార్మికులను ట్రాక్టర్లలో ఇసుక లోడింగ్‌కు అనుమతించారు. దాంతో రెండు విధాలుగా కార్మికులు లాభపడ్డారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క కార్మికుడిని క్వారీల్లోకి అడుగు పెట్టనీయకుండా కేవలం యంత్రాలతోనే ఇసుక లోడింగ్ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చి స్వేచ్ఛనీయటంతో రొయ్యూరు, వల్లూరుపాలెం, తోట్లవల్లూరు, భద్రిరాజుపాలెం, చాగంటిపాడు, దేవరపల్లి గ్రామాల్లో కార్మికులు క్వారీలను ఏర్పాటు చేసుకుని రోజుకు రూ.వెయ్యి ఆదాయం పొందుతూ వచ్చారు. సీఎం చంద్రబాబు చలవతో తామే ఐదేళ్ల తర్వాత ఇసుక క్వారీల్లో ఉపాధి పొందుతున్నామని ఆనందం వ్యక్తం చేశారు. అయితే ఇపుడు కొత్త విధానంతో ఇసుక క్వారీలను తెరుస్తామని అధికారులు ప్రజా సదస్సులు ఏర్పాటు చేసి యంత్రాలను వినియోగిస్తామని వెల్లడించటంతో కార్మికుల ఆనందం ఆవిరైంది.

నాడు టీడీపీ ప్రభుత్వంలో కార్మికుల ఉపాధి

2014 నుంచి 2019 వరకు కొనసాగిన నాటి టీడీపీ ప్రభుత్వం కార్మికుల జీవనోపాధి దెబ్బతినకుండా ఇసుక విధానం అమలు చేసింది. పట్టా భూముల్లో ఏర్పాటు చేసిన ప్రైవేటు క్వారీల్లో యంత్రాలకు అవకాశమిచ్చి కార్మికుల కోసం ప్రభుత్వ క్వారీలను నిర్వహించింది. ఆ విధానంతో కార్మికులతో ఎలాంటి వివాదం ఏర్పడలేదు. తోట్లవల్లూరు(నార్తువల్లూరు) పెద్దఏటిపాయలో ప్రభుత్వ క్వారీని ఏర్పాటు చేయగా,

మిగతా 6లో..

నెట్ ప్రాక్టీస్ కబ్జా

కోట్ల విలువైన వర్తక సంఘం స్థలం స్వాధీనానికి పీఈటీ అసోసియేషన్ కుట్ర

మచిలీపట్నంలో సుమారుగా రూ.12 కోట్ల విలువైన బందరు కిళ్లీ, సోడా, బీడీ వర్తక సంఘం స్థలంపై జిల్లా పీఈటీ అసోసియేషన్‌లోని ఇద్దరు సభ్యుల కన్నుపడింది. క్రికెట్ నెట్ ప్రాక్టీస్ పేరుతో ఆ స్థలం స్వాధీనానికి ప్రణాళిక రచించారు. సదరు స్థలంలోని భవనంలో నడుస్తున్న ప్రభుత్వ కార్యాలయాల అధికారులు దీన్ని అడ్డుకునేందుకు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఎట్టిపరిస్థితుల్లో ఆ స్థల తమకే దక్కాలనే పట్టుదలతో పీఈటీ అసోసియేషన్ సభ్యులు తెర వెనుక మరిన్ని వ్యూహాలు అమలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బందరు కిళ్లీ, సోడా, బీడీ వర్తక సంఘం స్థలం ఆక్రమణ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది.

- ప్రస్తుతం ఆ స్థలంలోని భవనంలో నడుస్తున్న ప్రభుత్వ కార్యాలయాలు
- వాటిని ఖాళీ చేయించేందుకు ప్రణాళికలు.. అడ్డుకున్న రెవెన్యూ అధికారులు
- అయినా కలెక్టర్‌ను ఒప్పించి స్థలం స్వాధీనానికి తెరవెనుక ప్రయత్నాలు
- వివాదాస్పదంగా బందరు కిళ్లీ, సోడా, బీడీ వర్తక సంఘం స్థలం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: మచిలీపట్నం నోబుల్ కళాశాలకు ఎదురుగా 50 సెంట్ల స్థలంలో బందరు కిళ్లీ, సోడా, బీడీ వర్తక సంఘానికి చెందిన భవనం ఉంది. ఈ భవనాన్ని 1962లో నిర్మించారు. భవనం పక్కనే 20 సెంట్లు వరకు స్థలం ఖాళీగా ఉంది. ప్రస్తుతం మార్కెట్ రేటు ప్రకారం ఇక్కడ చదరపు గజం ధర రూ.50వేలకుపైగానే ఉంది. కాగా, 2022 ఏప్రిల్‌లో జిల్లాల విభజన జరిగిన సమయంలో ఈ భవనంలోని గదులను జిల్లా పౌరసంబంధాలశాఖ డీడీ కార్యాలయం, ఉద్యానశాఖ ఏడీ, సెరికల్చర్ ఏడీ, భూగర్భ గనులు, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ, అటవీశాఖ, గ్రామీణ నీటిపారులశాఖ ఎస్ఈ కార్యాలయం, జిల్లా పరిశ్రమల శాఖ కార్యాలయాలకు కేటాయించారు. అప్పట్లో బెల్ కంపెనీ ఇచ్చిన రూ.25 లక్షల విరాళంతో ఈ భవనానికి మరమ్మతులు కూడా చేయించింది. అయితే పాత భవనంలో సౌకర్యాలు సక్రమంగా లేవనే కారణంతో పలు ప్రభుత్వ కార్యాలయాలను అప్పట్లో ఇక్కడ ఏర్పాటు చేయలేదు. ప్రస్తుతం ఈ భవనంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కార్యాలయం, మచిలీపట్నం డీవైఈవో కార్యాలయం, అటవీశాఖ జిల్లా కార్యాలయం, జిల్లా ఉపాధి కల్పన తదితర శాఖల కార్యాలయాలను నడుపుతున్నారు. ఈ భవనంలో ప్రభుత్వ కార్యాలయాలు నడుస్తుండటంతో పాటు, ప్రజలకు ఈ భవనం ఉపయోగపడుతుందనే కారణంతో బందరు కిళ్లీ, సోడా, బీడీ వర్తక సంఘం సభ్యులు ఆ వైపునకు వెళ్లకుండా వదిలేశారు.



బందరు కిళ్లీ, సోడా, బీడీ వర్తక సంఘం భవనం, ఖాళీ స్థలం

స్థలం చదును చేసి ఆక్రమణకు యత్నం

ఇటీవల జిల్లాకు చెందిన క్రీడాకారులు జాతీయ, రాష్ట్ర స్థాయిలో క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారు. వీరిని కలెక్టర్ వద్దకు పీఈటీ అసోసియేషన్ సభ్యులు తీసుకువెళ్లారు. ఆ సమయంలో బందరు కిళ్లీ, సోడా, బీడీ వర్తక సంఘం భవనం ఆవరణలోని స్థలాన్ని క్రికెట్ నెట్ ప్రాక్టీస్ కోసం కేటాయించాలనే ప్రతిపాదన చేశారు. అంతటితో ఆగకుండా ఈ స్థలాన్ని చదును కూడా చేయించారు. దీంతో ఈ భవనంలో వివిధ కార్యాలయాలకు చెందిన అధికారులంతా ఇక్కడ క్రికెట్ నెట్ ప్రాక్టీస్ పేరుతో స్థలాన్ని పీఈటీ అసోసియేషన్ సభ్యులు ఇద్దరు తమ ఆధీనంలోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ కార్యాలయాలను ఇక్కడి నుంచి తరలించేందుకు కుట్ర చేస్తున్నారని మచిలీపట్నం ఆర్డీవో కె.స్వాతిని ఆశ్రయించారు. ప్రభుత్వ కార్యాలయాలను ఎక్కడకు మార్చుకోవాలో తెలియడం లేదని, కార్యాలయాలకు అద్దె చెల్లించడం ప్రభుత్వంపై భారం పడుతుందని విన్నవించారు. క్రికెట్ నెట్ ప్రాక్టీస్ కోసమే అయితే మచిలీపట్నంలో ప్రభుత్వ స్థలాలు అనేకం ఉన్నాయని, బందరు కిళ్లీ, సోడా, బీడీ వర్తక సంఘం స్థలమే కేటాయించనవరసం లేదని కూడా అధికారులు ఆర్డీవోకు తెలిపారు. దీంతో ఆర్డీవో ప్రభుత్వ కార్యాలయాలు నడిచే భవనాన్ని పరిశీలించారు. అక్కడ క్రికెట్ నెట్ ప్రాక్టీస్‌కు స్థలం కేటాయించలేమని చెప్పకనే చెప్పారు. అయితే జిల్లా పీఈటీ అసోసియేషన్‌లోని ఇరువురు సభ్యులు ఈ స్థలం, భవనాన్ని తమ ఆధీనంలోకి తెచ్చుకునేందుకు తెరవెనుక మరింత వేగంగా మంత్రాంగం నడపడం వివాదాస్పమవుతోంది. ప్రభుత్వ కార్యాలయాలను ఖాళీచేయించే పరిస్థితి ఏర్పడటంతో ఉన్నతాధికారులు ఈ అంశంపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి.



ఆటోనగర్‌లోని ఎంఎస్ఎంఈ ఇండస్ట్రీస్ అసోసియేషన్ ఫెసిలిటేట్ సెంటర్‌లో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్

పారిశ్రామికంగా విజయవాడకు పూర్వవైభవం తెచ్చేందుకు కృషి

● ఎంపీ కేశినేని శివనాథ్ హామీ

ఆటోనగర్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు దీటుగా పారిశ్రామికంగా అన్ని రంగాల్లో ముందున్న విజయవాడకు మళ్లీ పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) హామీ ఇచ్చారు. ఇక నుంచి రాజకీయాలు మానేద్దామని, నగర అభివృద్ధి కోసం ఆలోచిద్దామంటూ ఆటోమొబైల్ పారిశ్రామికవేత్తలకు ఆయన పిలుపునిచ్చారు. శనివారం ఆటోనగర్‌లోని ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ ఇండస్ట్రీస్ అసోసియేషన్ ఫెసిలిటేట్ సెంటర్‌లో రిజిస్ట్రేషన్ సెంటర్‌ను ప్రారంభించాక, ఆటోమొబైల్ ఇండస్ట్రీస్ అభివృద్ధి కోసం తయారు చేసిన నివేదికను ఎంపీకి ఎంఎస్ఎంఈ ఇండస్ట్రీస్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు డి.రామకృష్ణ అందజేశారు. ఈ సందర్భంగా కేశినేని చిన్ని మాట్లాడారు. ప్రతి కుటుంబం నుంచి ఒక వ్యాపారవేత్త ఉండాలనేది ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆశయమన్నారు. ఆ ఆశయ సాధన కోసం విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పైలెట్ ప్రాజెక్టుగా 32 గ్రామాలను దత్తత తీసుకున్నానని చిన్ని ప్రకటించారు. 295 గ్రామాలను అభివృద్ధి చేస్తానని వెల్లడించారు. చిన్న తరహా సంస్థల ఏర్పాటులో రాష్ట్రం చాలా వెనుకబడి ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య కోర్సులు విద్యాసంస్థల్లో అందించేందుకు కృషి చేస్తానన్నారు. ఏపీ ఎంఎస్ఎంఈ గౌరవ అధ్యక్షుడు బాయన వెంకటరావు, అధ్యక్షుడు బీవీఎస్టీ సాయి, జనరల్ సెక్రటరీ ఎంఎస్ రామచంద్రరావు, సెక్రటరీ టీవీ నాగేశ్వరరావు, పలు సంఘాల నాయకులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

వివాహమైన రెండోరోజే నవ వధువుకు వేధింపులు

● రూ.50 లక్షలు ఇవ్వలేదని గదిలో నిర్బంధం
● వధువు కుటుంబ సభ్యులు ప్రశ్నించటంతో అమెరికాకు పరారయ్యేందుకు వరుడి ప్రయత్నం
● కేసు నమోదు చేసిన భవానీపురం పోలీసులు
● వరుడికి రిమాండ్..నెల్లూరు జైలుకు తరలింపు



అరెస్టయిన హేమంత్ అజయ్ (ఫైల్)

విద్యాధరపురం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): తండ్రి ఆర్టీసీలో ఉద్యోగం..కొడుకు ఉన్నత చదువులు చదివి అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ మంచి స్థితిలో ఉన్నాడు.. తమ కుమార్తెకు ఆ సాఫ్ట్‌వేర్ ఉద్యోగితో వివాహం చేస్తే సుఖంగా ఉంటుందని యువతి తల్లిదండ్రులు భావించారు. కట్నానికి వెనుకాడకుండా కోట్లాది రూపాయలు ఇచ్చి పెళ్లి జరిపించారు. కానీ, పెళ్లయిన రెండు రోజులకే రిసెప్షన్‌లో పెళ్లి కొడుకు తల్లిదండ్రుల నిజస్వరూపం బయటపడింది. వివరాల్లోకి వెళితే..కర్ణాటక రాష్ట్రం రాయచూర్, ఏక్లాస్‌పూర్ చౌదరీస్ కాలనీలో వెలిసేటి ప్రసన్నకుమార్ చౌదరి నివాసముంటున్నారు. తన కుమార్తె లక్ష్మీ కీర్తన చౌదరికి గొల్లపూడి జైన్ కాలనీలో నివాసముంటున్న ఆర్టీసీ విజయవాడ బస్‌స్టేషన్‌లో కంట్రోలర్ గా పనిచేసే చెరుకూరి లక్ష్మణరావు, భవానీ దంపతుల కుమారుడు అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న హేమంత్ అజయ్‌తో ఈనెల 7న రాయచూర్‌లో ఘనంగా వివాహం జరిపించారు. వివాహానికి ముందు నగదు, స్థిరాస్థులు బంగారం, వెండి మొత్తం కలిపి సుమారు రూ.5 కోట్లు కట్నంగా ఇచ్చేందుకు ఒప్పందం చేసుకున్నారు. హేమంత్ అజయ్ తల్లిదండ్రులు ఈనెల 9న నిడమానూరులోని ఓ ఫంక్షన్ హాల్‌లో రిసెప్షన్ ఏర్పాటు చేశారు. అక్కడ తమకు ఇస్తానన్న కట్నంలో రూ.50లక్షలు వెంటనే ఇస్తేనే వధువును ఇంటికి తీసుకువెళతామని స్పష్టంచేశారు. సమయం ఇస్తే డబ్బులు ఇస్తామని వధువు తల్లిదండ్రులు, బంధువులు చెప్పారు. అయినా వినలేదు. వధువు బంధువులు, స్నేహితులు వధూవరులను ఆశీర్వదించేందుకు వస్తే నిరాకరించారు. వధువు తల్లిదండ్రులు, బంధువులు ప్రశ్నిస్తే హేమంత్ అజయ్, అతని తల్లిదండ్రులు వారితో గొడవపడ్డారు. అనంతరం హేమంత్ అజయ్‌ను తల్లిదండ్రులు రిసెప్షన్ నుంచి వెంటబెట్టుకుని ఇంటికి తీసుకువెళ్లిపోయారు. వధువును విడిచి వెళ్లిపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు ఆమెను కారులో గొల్లపూడిలోని వరుడు ఇంటికి తీసుకువెళ్లారు. 10వ తేదీన అజయ్ తల్లిదండ్రులు వధువును తమ ఇంటిలోనే ఓ గదిలో నిర్బంధించారు. భోజనం కూడా పెట్టలేదు. ఆమె అత్తమామలను ప్రాధేయపడినప్పటికీ వారు పట్టించుకోలేదు. అసభ్యకరంగా దూషించారు. వధువు తల్లిదండ్రులు అక్కడికి వెళ్లి తమ కుమార్తె గురించి ఆరాతీశారు. ఆమెను బయటకు పంపించకపోగా, వారిపై దౌర్జన్యానికి దిగారు. విషయం తెలుసుకున్న పలువురు స్థానిక పెద్దలు అజయ్ ఇంటికి వెళ్లి గదిలో నిర్బంధించిన వధువును బయటకు తీసుకొచ్చారు. అజయ్ అమెరికా పారిపోవడానికి ప్రయత్నిస్తే వధువు బంధువులు కారును అడ్డగించారు. తల్లిదండ్రుల సహాయంతో ఈనెల 12వ తేదీన భవానీపురం పోలీసులకు లక్ష్మీ కీర్తనచౌదరి ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి హేమంత్ అజయ్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. కోర్టు అతనికి రిమాండ్ విధించింది. అతనిని నెల్లూరు జైలుకు తరలించారు.

ముంతాజ్‌బేగంకు స్వచ్ఛాంధ్ర అవార్డు



సీఎం చంద్రబాబునాయుడు నుంచి స్వచ్ఛాంధ్ర అవార్డు అందుకుంటున్న ముంతాజ్ బేగం

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం గాంధీనగర్‌లో మిద్దెతోట నిర్వహిస్తున్న విశ్రాంత ఉపాధ్యాయిని ముంతాజ్ బేగంకు కందుకూరులోని మార్కెట్ యార్డులో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబునాయుడు స్వచ్ఛాంధ్ర రాష్ట్రస్థాయి అవార్డు అందజేశారు. మిద్దెతోట నిర్వహిస్తూ తన ఇంటిలోనే తడిచెత్తను ఎరువుగా ముంతాజ్ బేగం తయారు చేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతున్నారు. అవార్డు అందుకున్న ముంతాజ్‌బేగంకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మచిలీపట్నం శాఖ అధ్యక్షుడు పి.శ్రీరామ్, నగరానికి చెందిన పలువురు అభినందనలు తెలిపారు.

శనగ రైతు లబోదిబో!

వరుసగా రెండేళ్ల నుంచి రైతులను నట్టేట ముంచుతున్న శనగ పంట ఈ ఏడాదీ ఆవేదనే మిగిల్చింది. దిగుబడులు సగానికి పైగా తగ్గడంతో శనగ రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరాకు ఐదారు క్వింటాళ్లకు మించి దిగుబడి రావటం లేదు. లాభం సంగతి సంగతి దేవుడెరుగు? పెట్టుబడి ఖర్చు కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదని రైతులు లబోదిబోమంటున్నారు.



నూర్పి రాశిగా చేసిన శనగలు

తగ్గిన దిగుబడులు

● మద్దతు ధర కంటే తక్కువకే విక్రయం
● నష్టాలు మూటగట్టుకున్నామని ఆవేదన

(ఆంధ్రజ్యోతి-కంచికచర్ల): ఈ ఏడాది రబీ సీజన్‌లో నందిగామ సబ్ డివిజన్ పరిధిలో 8,500 ఎకరాల్లో రైతులు శనగ పంటను సాగు చేశారు. కంచికచర్ల మండలంలోనే 6,500 ఎకరాల్లో పంట వేశారు. శనగ విత్తనాల ఖర్చు ఎకరానికి రూ.7 వేలు అయింది. కౌలుతో పాటుగా అంతరకృషి, ఎరువులు, పురుగుమందులు, ఇతరత్రా కలిపి రూ.30 వేల నుంచి రూ.35 వేల వరకు పెట్టుబడి అయింది. ప్రతికూల వాతావరణ పరిస్థితులు పంట దిగుబడిపై ప్రభావం చూపాయి. పైరు పూత, పిందె దశలో ఉన్నప్పుడు రెండు మూడురోజులు కొద్దిపాటి వర్షం కురిసింది. దీంతో పూత రాలిపోయింది. మళ్లీ పెద్దగా పూత రాలేదు. దీంతో దిగుబడి గణనీయంగా తగ్గింది. కొద్దిరోజుల నుంచి శనగ కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. కొంతమంది రైతులు కూలీలతో, మరికొంతమంది యంత్రాలతో కోయిస్తున్నారు. సాధారణంగా శనగ ఎకరానికి పది క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. ఈసారి ఐదారు క్వింటాళ్లకు మించి రావడం లేదు. కొంతమంది రైతులకు మూడు నాలుగు క్వింటాళ్లే దిగుబడి వస్తోంది.


గిట్టుబాటు కాని ధర

శనగలు నిల్వ చేయటానికి ఎక్కువ మంది రైతులకు గిడ్డంగులు, తగిన వసతులు లేవు. వెంటాడుతున్న ఆర్థిక ఇబ్బందులకు తోడు గత సీజన్ పంట ఇంకా శీతల గిడ్డంగుల్లో మూలుగుతోంది. దీంతో పలువురు రైతులు పంట కోసిన వెంటనే కల్లాల్లోనే అమ్ముతున్నారు. కేంద్ర ప్రభుత్వం శనగలకు ప్రకటించిన మద్దతు ధర క్వింటాలుకు రూ.5,650 ప్రస్తుతం బయటి మార్కెట్లో క్వింటాలు రూ.5,500 పలుకుతోంది. మద్దతు ధర కంటే మార్కెట్ ధర రూ.150 తక్కువగా ఉంది. పండిన శనగలు నాణ్యంగా ఉండడంతో ముందు ముందు ధర పెరుగుతుందని రైతులు ఆశిస్తున్నారు.

ఖర్చులైనా చేతికి రావు

దిగుబడి సగానికి సగం తగ్గడం వల్ల పెట్టుబడి ఖర్చులు కూడా చేతికి రావని రైతులు వాపోతున్నారు. పంట నూర్పిడి ఖర్చు భారంగా పరిణమించిందని, కూలీలతో నూర్పిడి ఎకరానికి రూ.5 వేలు, యంత్రంతో రూ.3 వేలు అవుతుందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్లో శనగకు లభిస్తున్న ధర గిట్టుబాటు కాదని చెబుతున్నారు. మద్దతు ధర రూ.7 వేలకు తగ్గకుండా ఉంటేనే గిట్టుబాటు అవుతుందని చెబుతున్నారు. మొత్తంగా నష్టాలను మూటగట్టుకోవాల్సి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కృష్ణానదిలో స్నానానికి దిగి యువకుడి మృతి



నది నుంచి బయటకు తీసిన నవీన్ మృతదేహం

జగ్గయ్యపేట రూరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): వేదాద్రి వద్ద కృష్ణా నదిలో స్నానానికి దిగిన యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన శనివారం జరిగింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తోట సూర్య శ్రీనివాస్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం..చందర్లపాడు మండలం కోనాయపాలెం గ్రామానికి చెందిన పోతుమర్తి నవీన్, గుడారి పద్మారావు బావబామ్మర్దులు. ఇద్దరూ బైకుపై వేదాద్రి యోగానంద లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి వచ్చారు. అక్కడ మొక్కులు తీర్చుకున్నారు. తర్వాత స్నానానికి కృష్ణా నదిలోకి దిగారు. నవీన్(23) నదిలో పడి మునిగియాడు. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాద వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు.

ప్రమాదరహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

● వాహనదారులకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ పిలుపు



విజేతకు ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

ధర్నాచౌక్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోకుండా రహదారుల భద్రత, రవాణాశాఖ సూచించిన నిబంధనలు పాటించాలని, హెల్మెట్లు ధరించాలని, ప్రమాదరహిత జిల్లాగా తీర్చిదిద్దడంలో భాగస్వాములు కావాలని వాహనదారులకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల ముగింపు కార్యక్రమం గాంధీనగర్‌లోని ఎన్జీవోహోంలో శనివారం నిర్వహించారు. వాహనదారుల భద్రతపై అవగాహన, ప్రచార కార్యక్రమాలను జిల్లా రవాణా, పోలీస్‌శాఖల ఆధ్వర్యంలో నిరంతరం నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. కొందరు బాధ్యత లేని వాహనదారుల వల్ల కొన్ని ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. హెల్మెట్లు ధరించని వాహనదారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హెల్మెట్ వినియోగంపై వివిధ రూపాల్లో ప్రచార కార్యక్రమాలో పాల్గొన్న వివిధ శాఖాధికారులకు, రోడ్డు భద్రతపై నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో విజేతలుగా నిలచిన విద్యార్థులు, మీడియా ప్రతినిధులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎ.విద్యాసాగర్, జిల్లా రవాణాధికారి ఎ.మోహన్, రవాణాశాఖ ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు ఎం.రాజుబాబు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.సుహాసిని, వీఎంసీ జోనల్ కమిషనర్ ప్రభుదాసు, డీసీపీ ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్ రుణాల మంజూరు వేగవంతం చేయాలి

● వెండర్లు, బ్యాంకర్లు సమన్వయంతో పనిచేయాలి: కలెక్టర్ లక్ష్మీశ

ఎన్టీఆర్ కలెక్టరేట్: పీఎం సూర్యఘర్ పథకం కింద సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుకు రుణాల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని, వెండర్లు, బ్యాంకర్లు సమన్వయంతో పనిచేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. సూర్యఘర్ పథకం కింద రుణాల మంజూరుపై శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సమన్వయ శాఖల అధికారులు, వెండర్లు, బ్యాంకర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. సూర్యఘర్ పథకం ద్వారా జిల్లాలో రెండు లక్షల ఇళ్లకు సోలార్ విద్యుత్ ప్యానెళ్లను అమర్చి జిల్లాను అగ్రగామిగా నిలపాలనే లక్ష్యంగా పనిచేస్తున్నామని, ఇప్పటివరకు 72,000 రిజిస్ట్రేషన్లు వచ్చాయని, ఇన్‌స్టలేషన్ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ రాయితీ మినహా మిగిలిన సొమ్మును బ్యాంకర్లు రుణంగా మంజూరు చేయాలన్నారు. జిల్లాలో ఆదర్శ సౌర గ్రామాలుగా గుర్తించిన బూదవాడ (జగ్గయ్యపేట), వెల్వడం(మైలవరం), పరిటాల(కంచికచర్ల), కంభంపాడు(ఎ.కొండూరు), షేర్ మహ్మద్‌పేట (జగ్గయ్యపేట) గ్రామాల్లో సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు లక్ష్యాలపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని, త్వరితగతిన నూరు శాతం లక్ష్యాన్ని చేరుకోవాలని మండలాల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, సూర్యఘర్ జిల్లా నోడల్ అధికారి ఎం.భాస్కర్, టెక్నికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హనుమయ్య, ఎల్‌డీఎం కె.ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్ర లక్ష్యం



రెడ్డిగూడెంలో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

● 'స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్'లో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

రెడ్డిగూడెం /ఇబ్రహీంపట్నం: ఆరోగ్య ఆంధ్ర లక్ష్యంగా స్వచ్ఛాంధ్ర ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. శనివారం రెడ్డిగూడెంలో స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ఆయన పాల్గొని స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరిస్తున్న విధానంతో పాటు తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరిస్తున్న తీరును పరిశీలించారు. వేర్వేరు డబ్బాల ద్వారా తడి, పొడి చెత్తను ఎలా వేయాలో వాటిని పారిశుధ్య సిబ్బందికి ఎలా అందజేయాలో వివరించారు. పరిసరాల పరిశుభ్రత వల్ల వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉంటాయని సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను చేరుకునేందుకు స్వచ్ఛత కూడా కీలకమేనని కలెక్టర్ అన్నారు.

● కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన ఏబీపీ బ్లాక్‌లో ఉన్న ఇబ్రహీంపట్నం మండలంలోని గుంటుపల్లిలో శనివారం నిర్వహించిన సమగ్ర ఆరోగ్య సర్వే(ఎన్‌సీడీ 3.0)ను కలెక్టర్ లక్ష్మీశ పరిశీలించారు. ఇంకుడు గుంతల శంకుస్థాపనలో ఆయన పాల్గొన్నారు. డీపీవో పి.లావణ్య కుమారి, ఆర్డీవో కె.మాధురి, ప్రత్యేక అధికారి పి.బాలాజీ కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాలకవర్గసభ్యుడు వేమూరి సాయివెంకటరమణ

కృష్ణా మిల్క్ యూనియన్‌పై ఆరోపణలు కుట్రపూరితం

● కొంతమంది కావాలనే చేస్తున్నారు
● ప్యాకెట్‌పై 'విజయ' ఉన్న ప్రతిదీ మాది కాదు
● 'విజయ' కింద కృష్ణా మిల్క్ యూనియన్ అని ఉంటేనే మా బ్రాండ్: పాలకవర్గ సభ్యుడు వేమూరి సాయి వెంకటరమణ

చిట్టినగర్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): 'కృష్ణా మిల్క్‌యూనియన్ నెయ్యి, పెరుగు, పాలు అమ్ముతుంది. బయట ప్రాంతాల్లో నెయ్యి కొనదు. కొంతమంది పనిగట్టుకుని కుట్రతో యూనియన్‌పై ఆరోపణలు చేస్తున్నారు. ఆరోపణలు చేసిన వ్యక్తికి ఏ సందేహం ఉన్నా వచ్చి చూసుకోవచ్చు.' అని యూనియన్ పాలకవర్గ సభ్యుడు వేమూరి సాయి వెంకటరమణ అన్నారు. శనివారం చిట్టినగర్ పాలఫ్యాక్టరీ సమావేశ హాలులో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయ అనేది అందరికీ సంబంధించిన ఉమ్మడి బ్రాండ్ అని, కృష్ణా మిల్క్‌యూనియన్ తయారు చేసే ప్రతి ప్యాకెట్‌పై విజయ అని ఉంటుందని, విజయ బ్రాండ్ కింద కృష్ణా మిల్క్‌యూనియన్ అని ఉంటేనే తాము బాధ్యులమని తెలిపారు. యూనియన్ పేరు లేకుండా విజయ అని మాత్రమే ఉంటే అది తమకు సంబంధం లేదన్నారు. పాడిరైతుగా కవులూరు పాల సొసైటీ అధ్యక్షుడిగా ఉన్న తాడికొండ రమేష్‌బాబు యూనియన్‌పై చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఏ సందేహాలు ఉన్నా సర్వసభ్యసమావేశంతోపాటు, సంస్థ ఎండీతో మాట్లాడాలని, బహిరంగంగా సమావేశాలు పెట్టి ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఆధారాలు లేకుండా సంస్థపై ఆరోపణలు చేస్తే చట్టపరంగా చర్యలకు వెనకాడేదిలేదని సాయి వెంకటరమణ హెచ్చరించారు. టర్నోవర్ ఆధారంగా రేటు, బోనస్ ఇవ్వరని లాభాల ప్రకారమే ఇస్తారని తెలిపారు. చలసాని ఆంజనేయులు హయాంలో యూనియన్ లాభాల బాట పట్టిందన్నారు. రూ.142 కోట్లు లాభాల ద్వారానే రైతులకు బోనస్‌లను ఇస్తున్నామన్నారు. లావాదేవీలు పూర్తిగా బ్యాంకు ద్వారా, కేటాయింపులు టెండర్ల ద్వారా చేస్తామన్నారు. వీరవల్లి ప్లాంట్‌లో నాలుగు బోర్లు ఉన్నాయని, నీటి కొరత లేదన్నారు. వీడ్‌ప్లాంట్ కోసం జరిపిన కొనుగోలు జానకిరామయ్య హయంలోనే జరిగిందన్నారు. టెండర్ పిలిస్తే రూ.25 లక్షలు డిపాజిట్ వదిలేసి ఆ కాంట్రాక్టర్ వెళ్లిపోయాడన్నారు. నష్టంలో నడిచే ప్రాజెక్టును అనవసరంగా నడుపుతున్నామనే భావన యూనియన్‌కు కలిగిందన్నారు. పాలప్రాసెసింగ్ యూనిట్ అనుకుని నిర్మాణం చేశామని తెలిపారు. అన్ని నిర్మాణాలు టెండర్ ప్రక్రియ ద్వారానే జరిగాయని, ట్రాన్స్‌పోర్టు కూడా పాత వారే చూసుకుంటున్నారని, రెండేళ్లకు ఒకసారి టెండర్ల ప్రక్రియలో పాల్గొని వారే దక్కించుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎండీ కొల్లి ఈశ్వరబాబు, పాలకవర్గ సభ్యులు దాసరి వెంకట బాలవర్ధనరావు, పల్లగాని కొండలరావు, అర్జా నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎస్ఆర్టీసీలో ప్రమాదాల రేటు చాలా తక్కువ

● డ్రైవర్లకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ప్రశంస
● ముగిసిన రోడ్డు భద్రతా మాసోత్సవాలు

బస్ స్టేషన్: 'దేశంలోని అన్ని ఆర్టీసీలకన్నా ఏపీఎస్ఆర్టీసీలో ప్రమాదాల రేటు చాలా తక్కువ(0.06)గా ఉంది. ఎన్టీఆర్ జిల్లాలోనూ డ్రైవర్లు మంచి నైపుణ్యంతో బస్సులు నడుపుతున్నారు. దీంతో ప్రమాదాలు తగ్గుతూ వస్తున్నాయి.' అని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ ప్రశంసించారు. ఈనెల 16వ తేదీ నుంచి ప్రారంభమైన రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు కార్యక్రమం శనివారం విజయవాడ డిపో గ్యారేజీలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ విచ్చేశారు. డ్రైవర్లు మానసిక ప్రశాంతతో ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకుంటూ అప్రమత్తంగా ఉంటూ వాహనాలు నడపాలని కలెక్టర్ సూచించారు. ఇవన్నీ పాటిస్తే ప్రమాదశాతం సున్నాకు రావడం కష్టమేమీ కాదన్నారు. బస్సుస్టేషన్ ఆవరణలో డ్రైవర్లు జాగ్రత్తగా, అప్రమత్తంగా బస్సులు నడపాలని జోన్-2 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయరత్నం సూచించారు. ఏపీఎస్ఆర్టీసీ భద్రతకు మారుపేరుగా నిలిచిందని జిల్లా రవాణా అధికారి ఎం.యేసుదానం అన్నారు. ప్రమాదాలను నివారించటానికి సంస్థ అన్ని చర్యలు తీసుకుంటుందని, ఇందులో డ్రైవర్ల పాత్ర ఎంతో కీలకమని ఆయన తెలిపారు. డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ ఎ.జాన్ సుధాకర్, పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ ఎన్.శ్రీనివాసరావు, పాల్గొన్నారు. ప్రమాదాలు జరగకుండా బస్సులు నడిపిన ఉత్తమ డ్రైవర్లకు ప్రశంసా పత్రాలను, బహుమతులను అందించి సత్కరించారు. ప్రతి డిపో నుంచి ముగ్గురు డ్రైవర్ల చొప్పున కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రాలు అందుకున్నారు. శనివారం ఆర్టీసీ బస్టాండ్‌లో జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.వై.దానం అధికారులు, సిబ్బందితో కలిసి స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. తడి, పొడి చెత్త వేరు చేయటం, పరిసరాలను పరిశుభ్రత, బయో వ్యర్థాలను వేరు చేయడంపై ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎ.జాన్ సుధాకర్, పర్సనల్ ఆఫీసర్ పి.వెంకటరమణ పాల్గొన్నారు.

జనసేన తుమ్మలపాలెం ఎంపీటీసీ సభ్యుడి రాజీనామా



రాజీనామా పత్రాలను చూపుతున్న పోలిశెట్టి తేజ

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 15 (ఫిబ్రవరి): తుమ్మలపాలెం ఎంపీటీసీ సభ్యుడు, జనసేన ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడు పోలిశెట్టి తేజ తన ఎంపీటీసీ పదవికి, మండల అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని జడ్పీ సీఈవోకు పంపుతున్నట్లు ఆయన తెలిపారు. శనివారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తన తండ్రి హరిబాబు చివరి కోరిక మేరకు తాను రాజకీయాల నుంచి పూర్తిగా తప్పుకుంటున్నట్లు చెప్పారు. అందరి సహకారంతో తుమ్మలపాలెం గ్రామంలో సుమారు రూ.35 లక్షలతో అభివృద్ధి పనులు చేయించగలిగానన్నారు. ఇప్పటి వరకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

అరాచకాలు చేసి.. పెడబొబ్బలు

(5వ పేజీ తరువాయి)

పేర్ని కిట్టు ఏకంగా టీడీపీ నాయకులు, కార్యకర్తల ఇళ్లపై దాడులకు పాల్పడ్డాడు.

చంద్రబాబు ఇంటిపై దాడికి యత్నించిన జోగికి మంత్రి పదవి

జోగి రమేష్ పెడన ఎమ్మెల్యేగా ఉండగా అనేక అరాచకాలు చేశారు. ప్రజలను బ్లాక్‌మెయిల్ చేసే స్థాయికి దిగజారారు. వలంటీర్లను చేతిలో పెట్టుకుని నచ్చిన వారికి పథకాలు ఇచ్చారు. ఇలాంటి దుందుడుకుగా వ్యవహరించిన జోగి రమేష్‌ను వైసీపీ పెద్దలు ప్రోత్సహించారు. చంద్రబాబు ఇంటిపై దాడికి జోగి ప్రయత్నించటం అప్పట్లో సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. చంద్రబాబు ఇంటిపై దాడికి వెళ్లాడని జోగి రమేష్‌ను ఆ పార్టీ అధినేత, ముఖ్య మంత్రిగా ఉన్న జగన్ ఏకంగా మంత్రి పదవి ఇచ్చి తన క్యాబినెట్‌లో కూర్చోపెట్టుకున్నారు.

ఇసుక క్వారీల్లో..ఇక యంత్రాలు!

(5వ పేజీ తరువాయి)

జిల్లాలో అనేక ప్రాంతాల నుంచి కార్మికులు వచ్చి ఇసుక లోడింగ్ చేసేవారు. రోజుకు రూ.1000 నుంచి రూ.1200 వరకు ప్రభుత్వ క్వారీలో ఆదాయాన్ని కార్మికులు పొందారు. రోజుకు రెండు వేల మంది కార్మికులు 2019 వరకు ఇసుక క్వారీలో పని చేసేవారు. ఇపుడు కూడా 2019కి పూర్వం ఉన్న ఇసుక విధానాన్ని సీఎం చంద్రబాబు అమలు చేయాలన్న ఆలోచన కార్మికుల్లో బలపడుతోంది.

యంత్రాలు వద్దని చెప్పాం



ఇసుక క్వారీల్లో యంత్రాలు ప్రవేశపెట్టవద్దని అధికారులకు కార్మికుల సంతకాలతో కూడిన వినతి పత్రాలను అందించాం. కార్మికుల జీవనోపాధిని కాపాడాలని కోరాం. ప్రజాభిప్రాయ సేకరణ సదస్సులోనే కార్మికులు ఏకాభిప్రాయంతో యంత్రాలు వద్దని చెప్పారు.

\- నిమ్మగడ్డ రాకేష్, ఇసుక మేస్త్రీ, రొయ్యూరు

ఇసుక పని కల్పించాలి



రొయ్యూరులో 300 మంది ఇసుక కార్మికులున్నారు. యంత్రాలు ఏర్పాటు చేస్తే వారందరి ఉపాధి దెబ్బతింటుంది. ఇలా ప్రతి గ్రామంలో వందలమంది ఇసుక క్వారీలపై ఆధారపడిన కార్మికులున్నారు. యంత్రాలు పెట్టుకున్నా ట్రాక్టర్లలో ఇసుక లోడింగ్‌కు వినియోగించుకోవాలి. కార్మికులకు ప్రత్యేకంగా క్వారీ ఉండాల్సిందే.

\- లుక్కా దుర్గా నాగేశ్వరరావు, ఇసుక మేస్త్రీ, రొయ్యూరు

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	120,129, 140
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 450

ప్రతి రైతుకు విశిష్ట సంఖ్య అవసరం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : రైతు విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోవడం ద్వారా వివిధ ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు నేరుగా పొందవచ్చని ఏవో జె. భవాని సూచించారు. కానుమోలు, ఆరుగొలను, ఎస్.ఎన్.పాలెం గ్రామాల్లోని ఆర్బీకే (రైతు సేవా కేంద్రాల్లో) శనివారం అవగాహన సదస్సులు నిర్వహించారు. సాగు భూమి ఉన్న ప్రతి రైతు 11అంకెల విశిష్ట సంఖ్య (యునిక్ ఐడీ) తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలన్నారు. కొత్తపల్లిలో మైక్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. సిబ్బంది శ్రావణి, నాగేంద్ర, పూర్ణచంద్రరావు, వీఏఏలు పాల్గొన్నారు.



యునిక్ ఐడీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో భవానీ

కొనసాగుతున్న దీక్షలు

ఉయ్యూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : డ్యూటీ చార్ట్ కౌన్సెలింగ్‌లో డిపో మేనేజర్ పక్షపాత, మొండివైఖరికి నిరసనగా నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికులు శనివారం రెండో రోజు రిలేదీక్ష కొనసాగించారు. అసోసియేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవుల శ్రీనివాసరావు, సభ్యుడు డీకే రావు రిలే దీక్షను ప్రారంభించారు. ఏ రాజేశ్‌కుమార్, జి సుబ్బారావు దీక్షలు పాల్గొనగా డిపో కమిటీ సెక్రటరీ పీఎం కృష్ణ, ప్రెసిడెంట్ కేఎస్ రావు, సభ్యులు, ఇతర డిపోల నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు.



రిలేదీక్షలో ఆర్టీసీ కార్మికులు

టీడీపీ నేత భావనారుషి మృతి

గన్నవరం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొల్లనపల్లి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు కోలవెంటి భావనారుషి మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం కన్నుమూశారు. ఆయనకు కొడుకు, కుమార్తె ఉన్నారు. టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు త్రిపురనేని భాస్కరరావు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ కోటగిరి వరప్రసాదరావు, మాజీ వైఎస్ ఎంపీపీ సామల ఆంజనేయులు, బీబీగూడెం మాజీ సర్పంచ్ తమ్మిశెట్టి రఘుబాబు, పద్మశాలి సేవా సంఘం నాయకులు నారదముని, బుజ్జిబాబు, మాజీ గ్రామ పార్టీ అధ్యక్షుడు దార్న హనుమంతరావు తదితరులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదివారం అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి..

కంకిపాడు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు మృతి చెందిన ఘటన కంకిపాడులో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొణతనపాడు శివారు తాళ్లూరి హైట్స్‌లో నివాసముంటున్న మట్టా వెంకటస్వామి (62) ఈ నెల 14న సాయంత్రం వాకింగ్ అంటూ బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో వెంకటస్వామి భార్య స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో విచారణ చేపట్టిన పోలీసులు ఓ వ్యక్తి కంకిపాడు సర్వీసు రోడ్డులో మృతి చెంది ఉన్నట్టు గుర్తించారు. గుండెపోటుతో చనిపోయారా లేక ఇంకేమైనా కారణం ఉందా అన్న కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



జంక్షన్ ఆర్వోబీపై వదిలేసిన గడ్డి ట్రాక్టర్

ప్రమాదభరితంగా గడ్డి ట్రాక్టర్

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నూజివీడు రోడ్డులో ప్రమాదవశాత్తు ఆర్వోబీ వంతెనపై గడ్డి ట్రాక్టర్ పడి రెండు రోజులు అవుతుది. ప్రమాదభరితంగా ఉన్న దానిని తొలగించే చర్యలను పోలీసులు చేపట్టకపోవడంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం ఉదయం అప్పారావుపేట నుంచి గొల్లపల్లికి గడ్డిని రవాణా చేస్తున్న ట్రాక్టర్ ప్రమాదవశాత్తు రోడ్డు మార్జిన్‌లో బోల్తా కొట్టి ఒక యువకుడు మృతి చెందిన విషయం తెలిసిందే. మరో ప్రమాదం జరగకుండా తక్షణమే పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజానీకం కోరుతున్నారు.



విమానాశ్రయంలో మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న వెటర్నరీ విద్యార్థులు

సమస్యలు పరిష్కరించాలి

మంత్రి నారా లోకేశ్‌కు వెటర్నరీ కళాశాల విద్యార్థుల వినతి

గన్నవరం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం విమానాశ్రయానికి శనివారం వచ్చిన మంత్రి నారా లోకేశ్‌కు వెటర్నరీ కళాశాల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. చాలిచాలని స్టైఫండ్‌తో ఇబ్బంది పడుతున్నామని పెంచాలని కోరారు. పరిశీలించి తగిన న్యాయం చేస్తానని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. అలాగే చెన్నై నుంచి వచ్చిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు కూడా వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం పవన్‌కల్యాణ్ రోడ్డు మార్గాన మంగళగిరి వెళ్లారు.

విమానాశ్రయంలో బాలకృష్ణ సందడి..

గన్నవరం విమానాశ్రయంలో ప్రముఖ సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ రాకతో సందడి వాతావరణం నెలకొంది. పద్మభూషణ్ అవార్డు అందుకున్న తరువాత తొలిసారిగా గన్నవరం రావటంతో అభిమానులు వచ్చారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ, సినీ ఇండస్ట్రీకి వచ్చి 50ఏళ్లు అయ్యిందన్నారు. ప్రపంచమంతా నా పేరు వినిపిస్తుందంటే దానికి కారణం అభిమానులేనని చెప్పారు. అభిమానుల వల్లే పద్మభూషణ్ వచ్చిందని దానికి సంతోషంగా ఉందన్నారు.



పెనమలూరు ఉన్నత పాఠశాలలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

కూటమి అభ్యర్థి ఆలపాటి రాజాను గెలిపించాలి

పెనమలూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల ఎన్నికల్లో గుంటూరు, కృష్ణాజిల్లాల ఎన్డీఏ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజాను అత్యధిక మెజారిటీతో గెలిపించుకుందామని పెనమలూరు టీడీపీ నాయకులు పిలుపు నిచ్చారు. శనివారం టీడీపీ సీనియర్ నాయకులు మారుపూడి ధనకోటేశ్వరరావు, మండల టీడీపీ అధ్యక్షులు కోయ ఆనంద్‌ప్రసాద్‌ల ఆధ్వర్యంలో పెనమలూరు ఉన్నత పాఠశాలలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తోటకూర ఉదయభాస్కర్, యలమంచిలి ప్రసాద్, చిగురుపాటి శ్రీనివాసరావు, మోర్ల నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



ఈడుపుగల్లు జిల్లా పరిషత్ పాఠశాలలో టీడీపీ నేతల ప్రచారం

అభివృద్ధి, సంక్షేమం చూసి ఓటేయండి

కంకిపాడు : కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు చూసి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని కంకిపాడు మాజీ ఎంపీపీ దేవినేని రాజా అన్నారు. మండలంలోని ఈడుపుగల్లు జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం ఆయన పర్యటించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పందిపాటి ఇందిర, టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షులు షేక్ షకార్, జిల్లా కార్యదర్శి పందిపాటి సుధాకర్, షేక్ సలీం, జాషువ, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను గెలిపించాలని ప్రైవేట్ స్కూల్ టీచర్స్ యూనియన్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎం. రవిబాబు ఉపాధ్యాయులను కోరారు. శనివారం మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో టీడీపీ బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గండేపూడి నితీష్, మాతంగి వెంకటేశ్వరరావు, దయాల రాజీవ్, వంపుగాని చిన్న, అక్కినేని రాఘవేంద్రరావు, దయాల సుహాస్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం దిశగా కృషి చేస్తుందని అందుకే కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని నియోజకవర్గ పోల్ మేనేజ్మెంట్ కో-ఆర్డినేటర్ ఆళ్ల గోపాలకృష్ణ కోరారు. వీరవల్లి, రంగన్నగూడెం, బండారుగూడెం, ఎ.సీతారాంపురం, కోడూరుపాడు ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయులను ఆళ్ల గోపాలకృష్ణ ఆధ్వర్యంలో బృంద సభ్యులు శనివారం కలిసి ఆలపాటికి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో గుండపనేని ఉమా వరప్రసాద్, ఆర్నేపల్లి సూరిబాబు, మండాది రవీంద్ర, లంక అజయ్‌కుమార్, పాండురంగారావు, , గండేపూడి నితీష్‌కుమార్, మాతంగి వెంకట్, దయాల రాజీవ్, తదితరులు పాల్గొన్నారు.



కోడూరుపాడు, వీరవల్లిలో టీడీపీ నేత ఆళ్ల గోపాలకృష్ణ ప్రచారం

పిల్లల పోషకాహారంపై దృష్టి సారించాలి

ఉంగుటూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు అందించే పోషకాహారంపై దృష్టి సారించడంతోపాటు ప్రీస్కూల్ నాన్ ఫార్మల్ విద్యా నాణ్యతను మెరుగుపరచడానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఎంఈవో-2 జె.సాంబశివరావు అన్నారు. ఉంగుటూరు జడ్పీహైస్కూల్‌లో అంగన్వాడీ కార్యకర్తలకు గత మూడు రోజులుగా జరుగుతున్న పోషణ్ బీ పడాయి బీ శిక్షణ కార్యక్రమాలు శనివారంతో ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు బి.పద్మాదేవి, ఎల్.దుర్గాదేవి, పాఠశాల హెచ్‌ఎం, సీహెచ్ అనిత, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై డ్రైవర్లు శ్రద్ధ చూపాలి: ఎంవీఐ

గన్నవరం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యం పట్ల డ్రైవర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి.పద్మాకర్ అన్నారు. గన్నవరం విమానాశ్రయం ఎదురుగా ఉన్న రవాణ శాఖ వాహన పట్టుత్వ కేంద్రంలో రోడ్డు భద్రత మాసోత్సవాలుశనివారం ఘనంగా ముగిశాయి. డ్రైవర్లకు బ్లడ్ గ్రూప్‌లు, బీపీ షుగర్, కంటి పరీక్షలు నిర్వహించి 25 మంది స్కూల్ బస్ డ్రైవర్‌లకు హెల్త్ కార్డులను పద్మాకర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్కూల్ బస్సుల నిర్వహణ విషయంలో యాజమాన్యాలు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలన్నారు. బస్సులు నడిపే డ్రైవర్లు ప్రతి మూడు నెలలకొకసారి వైద్యపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఎంవీఐలు వై.నాగేశ్వరరావు, శివరామగౌడ్, ఎం.ఆలీ, జీవిఎస్ఎన్ మూర్తి, డివి రమణ, తదితరులు పాల్గొన్నారు.



హెల్త్‌కార్డు అందజేస్తున్న ఎంవీఐ వి.పద్మాకర్

గ్రామాల్లో వైద్యసేవలు అభినందనీయం

ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ కావాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. స్థానిక శ్రీ మల్లికార్జున విద్యాసంస్థల ప్రాంగణంలో ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, సూపర్ స్పెషాలిటీ వైద్యులచే వైద్యశిబిరం ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. ప్రజలు కూడా వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం కూడా వైద్యానికి అధిక ప్రాధాన్యతనిస్తుందని తెలిపారు. త్వరలో గన్నవరం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని వంద పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అనంతరం మెదడు, నరాలు, షుగర్, థైరాయిడ్, జీర్ణకోశ, కీళ్లవాతం, ఊపిరితిత్తుల వ్యాధు లు, గుండెకు సంబం ధించిన పరీక్షలు 900 మందికి చేసి అవస రమైన వారికి మందులు అందజేశారు. విద్యాసంస్థల డైరెక్టర్ నక్కిన చిన వెంకట్రాయుడు, ప్రిన్సిపాల్ దాసరి మాధవిలత, నక్కిన మహేష్, హాస్పిటల్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ గిరిబాబు, కోనేరు కోటేశ్వరరావు, చిన్ని మాధవి, టిఎస్ఆర్కె ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

మస్కట్‌లో చిక్కుకున్న మహిళ

ఎమ్మెల్యే యార్లగడ్డ చొరవతో వెనక్కి

ఉంగుటూరు మండలం పెద్ద అవుటపల్లి గ్రామానికి చెందిన వేల్పూరి జ్యోతి ఉద్యోగ అవకాశం పేరుతో మోసపోయి మస్కట్ దేశానికి వెళ్లింది. ఆమెను ఇంటి పనుల కోసం తీసుకువెళ్లిన నకిలి ఏజెంట్ అక్కడ తీవ్రమైన హింసకు గురిచేశాడు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దృష్టికి తీసుకు వెళ్లారు. వెంటనే స్పందించిన యార్లగడ్డ అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారుల చొరవతో జనవరి 17న గ్రామానికి చేరుకుంది. శనివారం రాత్రి గన్నవరం క్యాంపు కార్యాలయంలో యార్లగడ్డను కలసి ధన్యావాదాలు తెలిపారు. అలాగే నున్న మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పించటంతో 20 మంది మహిళలు వచ్చి యార్లగడ్డను కలసి ధన్యావాదాలు తెలిపారు.

తడి, పొడి చెత్త వేర్వేరుగా అందజేయాలి

జిల్లా పంచాయతీ అధికారి జె అరుణ

ఉయ్యూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఇళ్లలో చెత్త ఇతర వ్యర్థాలను తడి, పొడిగా విభజించి పారిశుధ్య కార్మికులకు అందజేయాలని జిల్లా పంచాయతీ అధికారి జె అరుణ అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కాటూరులో పర్యటించి చెత్త సేకరణ విధానాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎంపీడీఓ శేషగిరిరావు, ఈఓ పీఆర్డీ కోటేశ్వరరావు, కార్యదర్శి సుబ్బారావు పాల్గొన్నారు.

● కాటూరు పంచాయతీ కార్యదర్శి పీవీ సుబ్బారావుకు స్వచ్ఛ కృష్ణా పురస్కారం లభించింది. ఉయ్యూరు మండల పరిధిలో కలెక్టర్ నుంచి సుబ్బారావుకు పురస్కారం లభించగా శనివారం జిల్లా పంచాయతీ అధికారి జె అరుణ నుంచి జ్ఞాపిక ప్రశంసపత్రం అందుకున్నారు.

పెనమలూరు : మన పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే మనం ఆరోగ్యవంతంగా జీవించగలుగుతామని పెనమలూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు డాక్టర్ రాజా పేర్కొన్నారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిసరాలను శుభ్రం చేసే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ లక్ష్మయ్య, పీహెచ్ఎన్ లక్ష్మి, హెచ్‌వీ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం : మండలంలోని బుద్ధవరం ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డును శనివారం మండల ప్రత్యేకాధికారి డి.విజయవర్ధనరావు, ఎంపీడీవో పి.స్వర్ణలత పరిశీలించారు. ఈవోపీఆర్‌డీ టి.భారతి, ఏపీవో సత్యప్రియ, పంచాయతీ కార్యదర్శులు, సరోజిని, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. అలాగే గన్నవరం బాలుర ఉన్నత పాఠశాలల్లో పంచాయితీ కార్యదర్శి చెన్నకేశవులు విద్యార్థులకు తడిపొడి చెత్తపై అవగాహన కల్పించారు.



కాటూరు కార్యదర్శి పీవీ సుబ్బారావుకు స్వచ్ఛ కృష్ణా పురస్కారం అందజేస్తున్న డీపీవో అరుణ

ప్రసాదంపాడు : గ్రామాల్లోని చెత్తను వేర్వేరుగా విభజించి చెత్త డబ్బాల్లో వేయాలని ప్రత్యేక అధికారి పి. మురళీకృష్ణ అన్నారు. శనివారం నిడమానూరు పంచాయతీలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ అవగాహవ ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కె.సుగుణ, పంచాయతీ కార్యదర్శి ఎస్. నరసింహారావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ : పరిసరాల శుభ్రత పట్ల విద్యార్థుల్లో అవగాహన పెరిగితే ఇంటి ఆవరణతో పాటు గ్రామాన్ని కూడా పరి శుభ్రంగా ఉంచుతారని బాపులపాడు మండల ప్రత్యేకాధికారి కె. శంకరరావు అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో శనివారం ఎంపీడీవో కె.జోగేశ్వరరావు పర్యవేక్షణలో హెచ్‌ఎం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బాపులపాడు జడ్పీ హైస్కూ ల్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ప్రకటన

మా క్లయింటు - డో.నెం. 24-22-20, దుర్గాపురం, విజయవాడ కాపురస్తులు - అల్లూరి మధుసూదనరావు గారి కుమారుడు వెంకట సతీష్ గారి సంజాయిషీ పొంది తెలియజేయునది ఏమనగా మా క్లయింటు లేట్ వేమూరి వెంకటేశ్వరరావు గారి కుమారుడు, డో.నెం. 23-9/25/1, వినాయక్ నగర్, రామచంద్రపురం, సంగారెడ్డి జిల్లా, హైదరాబాద్ కాపురస్తులు అయినట్టి 1) వేమూరి సోమసుందరరావు, లేట్ వేమూరి వెంకటేశ్వరరావు గారి కుమారుడు, డో.నెం. 23-27/A, జ్యోతినగర్, రామచంద్రపురం, సంగారెడ్డి జిల్లా, హైదరాబాద్ కాపురస్తులు అయినట్టి 2) వేమూరి కృష్ణార్జునరావు మరియు లేట్ వేమూరి వెంకట సుబ్బారావు గారి కుమారుడు, ఫ్లాట్ నెం. SF-6, సాయి టవర్స్, డో.నెం. 42-3-1, రామకృష్ణాపురం, విజయవాడ కాపురస్తులు- 3) వేమూరి సాయి మహేష్ బాబు గార్ల వద్ద షెడ్యూలు దాఖలా ఆస్తిని కొనుగోలు చేయుటకు ఒప్పందం కుదుర్చుకుని, పై ముగ్గురికీ అడ్వాన్సు ఇచ్చి, విడివిడిగా మూడు రసీదులు కూడా పొందియున్నారు. కాగా, సదరు పై ముగ్గురూ మా క్లయింటుకు రిజిస్ట్రేషన్ చేయకుండా కాలయాపన చేయుచున్నారు. పై విషయమై మా క్లయింటూ పై ముగ్గురికీ లీగల్ నోటీసులు కూడా ఇచ్చియున్నారు. కావున, సదరు 1) వేమూరి సోమసుందరరావు, 2) వేమూరి కృష్ణార్జునరావు మరియు 3) వేమూరి సాయి మహేష్ బాబు అనువారు షెడ్యూల్ ఆస్తిపై జరిపే ఎట్టి క్రయవిక్రయాలు, తనఖా వగైరాలు గానీ చెల్లనేరవానివీ, అవి మాక్లయింటుని బైండు చేయజాలవానివీ ఇందుమూలముగా తెలియజేయడమైనది.

షెడ్యూలు :- కృష్ణా జిల్లా, గన్నవరం మండలం, వెదురుపావులూరు గ్రామంలోని సర్వే నెం. 139/2 & 139/3 దాఖలా య. 1-30ల్ల భూమికి హద్దులు తూర్పు: R.S.No. 139/3 దాఖలా యలమంచిలి రత్నకుమార్ గారి ఆస్తి: దక్షిణం : గరిమెళ్ళ కృష్ణయ్య వగైరాల ఆస్తి: పడమర: వేమూరి అప్పారావు గారు మేడసాని రమాదేవి గార్కి గిఫ్టుగా ఇచ్చిన ఆస్తి: ఉత్తరం : రోడ్డు.

రావి రామమోహన్ రావు, గుమ్మడి అనిత, తూమాటి బాలమురళీకృష్ణ, అడ్వకేట్స్,
ఫస్ట్ ఫ్లోర్, శ్రీ సాయిదత్త టవర్స్, శేషాద్రిశాస్త్రి స్ట్రీట్, గవర్నర్ పేట, విజయవాడ - 520002,
ఫోన్: 9848123311

కొత్తా.. నగరమండీ..!

గొల్లపూడి

గొల్లపూడిలో ఏర్పాటు చేసిన డీమార్ట్, స్టైల్ యూనియన్, రిలయన్స్ ట్రెండ్స్ షోరూమ్స్



గొల్లపూడి దగ్గర్లో ఏర్పాటు చేసిన క్రాస్ రోడ్స్ రెస్టారెంట్స్, మెక్ డొనాల్డ్స్, ఖలీల్‌బాయ్ రెస్టారెంట్



బెజవాడకు దీటుగా అభివృద్ధి చెందుతున్న గొల్లపూడి

- ఎన్టీఆర్ జిల్లా పశ్చిమ ప్రాంతానికి మరో విజయవాడ
- దిగ్గజ వ్యాపార సంస్థల స్థాపనతో దినదినాభివృద్ధి
- ఫ్యాషన్ వస్త్రాల దుకాణాలు.. ఫుడ్ సెంటర్ల ఏర్పాటు
- రానున్న రోజుల్లో మరింత విస్తరించడం ఖాయం

ఒకప్పుడు ఏం కావాలన్నా విజయవాడకు వెళ్లాలి! ఇప్పుడేం కావాలన్నా గొల్లపూడి వెళితే చాలు. ఎన్టీఆర్ జిల్లా పశ్చిమ ప్రాంత వాసులకు విజయవాడ కొరతను ఇప్పుడు గొల్లపూడి తీరుస్తోంది. ఏ అవసరాలకు విజయవాడ వెళుతున్నారో ఇప్పుడవన్నీ గొల్లపూడిలోనే దొరుకుతున్నాయి. దీంతో ఇటు ఇబ్రహీంపట్నం, మైలవరం, అటు నందిగామ వరకు గొల్లపూడిని మినీ విజయవాడగానే చూస్తోంది. ఎందుకంటే విజయవాడ అంటే షాపింగ్ క్రేజ్‌తో వస్తుంటారు. అలాగే మంచి ఫుడ్, మంచి వైద్యం కోసం వస్తుంటారు. అలాగే విజయవాడలో కార్పొరేట్ షోరూమ్‌లు ఎన్నో ఉన్నాయి. ఇప్పుడవన్నీ గొల్లపూడిలోనే కనిపిస్తూ మినీ విజయవాడలా మారిపోయింది. విజయవాడతో సమానంగా కమర్షియల్ హబ్‌గా గొల్లపూడి విస్తరిస్తోంది. మినీ విజయవాడగా మారిపోతున్న గొల్లపూడిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

- ఇబ్రహీంపట్నం/గొల్లపూడి, ఆంధ్రజ్యోతి

విజయవాడ - హైదరాబాద్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్ - 65) రెండు వైపులా విస్తరించిన గొల్లపూడిలో అభివృద్ధి కొత్తపుంతలు తొక్కుతోంది. ఇప్పటికే నగరంలో ఉన్న అనేక రకాల ప్రముఖ వ్యాపార, ఆహార, వాణిజ్య సంస్థల బ్రాంచ్‌లు గొల్లపూడిలో నెలకొల్పబడ్డాయి. మారుతున్న కాలానికనుగుణంగా మనుషుల అభిరుచులు, కోర్కెలు మారుతుండటంతో వ్యాపారులు సైతం అందుకు అనుగుణంగా తమ వ్యాపార పద్ధతులను మార్చేస్తున్నారు. ఒకప్పుడు విజయవాడ వెళితే కాని లభించని అనేక బ్రాండెడ్ దుస్తులు, చెప్పులు, షూలు, గృహోపకరణాలు ఇప్పుడు గొల్లపూడినేలో లభిస్తున్నాయి.

ప్రముఖ కంపెనీల స్థాపన

గొల్లపూడిలో వ్యాపారం విస్తరించడానికి అనువైన వాతావరణం ఉంది. ఉత్తరం వైపు అపార్ట్‌మెంట్స్ నిర్మించేందుకు అనువైన భూములున్నాయి. ఇప్పటికే అనేక అపార్ట్‌మెంట్స్, విల్లాల నిర్మాణాలు జరుగుతున్నాయి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వ్యాపారం విస్తరించేందుకు ప్రముఖ బహుళ జాతి కంపెనీలు పోటీ పడుతున్నాయి. ఇప్పటికే ఆంధ్ర ఆసుపత్రి, సోనోవిజన్, డీమార్ట్, ట్రెండ్‌సెట్, విజేత సూపర్ మార్కెట్, టయోటా కార్ల షోరూమ్, రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్ బైక్స్ షోరూంలు ఏర్పాటు చేశారు. మైలురాయి సెంటర్లో కొత్తగా స్టైల్ యూనియన్ నెలకొల్పుతున్నారు. గృహ నిర్మాణానికి సంబంధించి అనేక టైల్స్, మార్బుల్స్, కంపెనీలు ఇక్కడే ఉన్నాయి. ఇదిలాగే దినదినాభివృద్ధి చెందుతూ ఉంటూ భవిష్యత్‌లో గొల్లపూడి మరో కూకట్‌పల్లి కావడం ఖాయమని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పశ్చిమ బైపాస్ మరో ఎసెట్

గొల్లపూడిలో వ్యాపారాభివృద్ధికి ఇటీవల నిర్మించిన పశ్చిమ బైపాస్ మరో ఎసెట్‌గా నిలుస్తోంది. గొల్లపూడిని కలుపుతూ కృష్ణానది మీదుగా రాజధాని నగరానికి నిర్మిస్తున్న వంతెనతో గొల్లపూడి దశ మారబోతోంది. ఇది వ్యాపారాభివృద్ధికి మరింత దోహదం చేస్తుందనే చెప్పాలి. విజయవాడతో సంబంధం లేకుండా రాజధాని అమరావతి నుంచి నేరుగా గన్నవరం వైపు వెళ్లే అనేక మందికి గొల్లపూడి ఒక ప్రత్యామ్నాయం. అందుకే వ్యాపారులు చూపు గొల్లపూడిపై పడింది.



విజయవాడ పశ్చిమ బైపాస్

ఫుడ్ ప్రియులకు మస్త్

జిహ్వా చాపల్యం ఉన్న భోజన ప్రియులకు అనుకూలమైన హోటళ్లు సైతం ఉన్నాయి. వన్ సెంటర్‌లో క్రాస్‌రోడ్‌తో పాటు స్వీట్ మ్యాజిక్ మిఠాయి దుకాణం ఉంది. అంతేకాక ఖలీల్‌భాయ్ రెస్టారెంట్ దగ్గర్లోనే ఉంది. ఇలా అనేక రకాల భోజన హోటల్స్, బిర్యానీ సెంటర్లున్నాయి.

గ్రేటర్‌లో కలిపే అవకాశం

భవిష్యత్‌లో గొల్లపూడి గ్రేటర్ విజయవాడలో కలిసే అవకాశం ఉండటం ఈ అభివృద్ధికి మరో కారణం. గ్రేటర్‌లో కలిపితే విజయవాడతో మరింత పోటీ పడి మరీ అభివృద్ధి జరిగే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

పోలీసులంటే ధైర్యం.. న్యాయవాదులతో న్యాయం

- హోం మంత్రి అనిత

విజయవాడ లీగల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): సమాజానికి ధైర్యమిచ్చేవారు పోలీసులైతే ప్రజలకు న్యాయం చేసేవారు న్యాయవాదులని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. లబ్బీపేటలోని వైవీ రావు ఆసుపత్రి రోడ్డులో ఉన్న జీఆర్‌టీ హోటల్‌లో డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ ఆధ్వర్యంలో డిజిటల్ ఎవిడెన్స్ ప్రాముఖ్యత గురించి రాష్ట్రస్థాయి వర్క్‌షాపు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన హోం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ ఎంతటి వారైనా కోర్టుకొస్తే చేతులు కట్టుకొని నిల్చునేంతటి గౌరవం న్యాయ వ్యవస్థకు ఉందన్నారు. దొంగ, నేరస్థుడు దొరికినా చట్టప్రకారమే శిక్షించాల్సి రావడంతో కేసు పూర్వయ్యే వరకు ప్రతి విషయం కీలకమేనన్నారు. విజయనగరం జిల్లాలోని రెండు కేసుల్లో నిందితులకు 6 నెలల్లోపే శిక్షలు వేయించడం జరిగిందన్నారు. న్యాయవ్యవస్థకు అవసరమైన వనరులు, వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ప్రొటోకాల్ లేకుండా ట్రాఫిక్‌లో ప్రయాణించి ప్రజల కష్టాలను తెలుసుకొనే ప్రయత్నం చేశానన్నారు. ఏ కష్టం కలిగినా కాపాడేది పోలీసులేనన్న ఆమె ప్రజల అభిప్రాయాలను మనం అర్థం చేసుకోవాలన్నారు. డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ బైరా రామకోటేశ్వరరావు మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో సైబర్ మోసాలు, ఆర్థిక కుంభకోణాలు, ఆన్‌లైన్ వేధింపులు, డిజిటల్ ఐడెంటిటీ దొంగతనాలు విపరీతంగా పెరిగాయని, ఈ పరిస్థితుల్లో న్యాయస్థానంలో సమర్థమైన తీర్పుల కోసం డిజిటల్ సాక్ష్యాలు కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. ఏపీపీల 5 జీ డేటా సిమ్‌కార్డుల కొనుగోలుకు ప్రభుత్వం రూ.10 లక్షలు మంజూరు చేసిందన్నారు. పరిశోధన, ప్రాసిక్యూషన్ వ్యవస్థ బలోపేతానికి రూ.42 లక్షలు, ప్రాసిక్యూటర్లు, కోర్టులు, పోలీసు వ్యవస్థ మధ్య సమర్థవంతమైన సమాచార వ్యవస్థకు 465 లాప్‌టాప్‌లు అందించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకొన్నట్టు బైరా తెలిపారు. పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు మాట్లాడుతూ నేరాలను చేధించడానికి డిజిటల్ ఆధారాలు కీలకమన్నారు. సీసీ టీవీ ఫుటేజ్, మొబైల్ కాల్ రికార్డులు, ఈ-మెయిల్స్, సోషల్ మీడియా సంభాషణలు, జీపీఎస్ డేటా, ఆన్‌లైన్ లావాదేవీలు, ఫోరెన్సిక్ డేటా వంటి ఆధారాలు నేరపరిశోధనలో సహాయపడతాయనానరు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఫోరెన్సిక్ టూల్స్ ద్వారా ఆధారాలను ధ్రువీకరించి, న్యాయపరగా సమర్థంగా ఉపయోగించవచ్చన్నారు. జాయింట్ డైరక్టర్లు వి.రాజేంద్రప్రసాద్, విజయ మాట్లాడుతూ మహిళలపై జరిగే నేరాల విషయంలో ఒక ప్రధాన సమస్య ఏంటంటే తక్కువ శిక్ష విధింపు, బాధితులు ముందుకు రావడానికి భయపడటం, సాక్ష్యాల కొరత, విచారణలో జాప్యం, నేరస్థులు శిక్ష నుంచి తప్పించుకోవడం వంటి అంశాలు ప్రధాన కారణాలన్నారు. కేసులను సమర్థంగా నడపడానికి అవసరమైన ఫోరెన్సిక్ ఆధారాలు సకాలంలో సేకరించలేకపోవడం, పోలీసు దర్యాప్తులో లోపాలు, బాధితులపై సామాజిక ఒత్తిడి, పోక్సో, నిర్భయ యాక్ట్, డొమెస్టిక్ వయొలెన్స్ యాక్ట్ లాంటి చట్టాలను కఠినంగా అమలు చేయాలన్నారు. అనంతరం హోం మంత్రి అనితను ఏపీపీలందరూ కలిసి గజమాలతో సత్కరించారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన ఏపీపీలు పాల్గొన్నారు.



హోంమంత్రి వంగలపూడి అనితను గజమాలతో సత్కరిస్తున్న ఏపీపీలు

తిరువూరు మున్సిపాల్టీలో ముసలం

చైర్ పర్సన్‌పై అవిశ్వాసం దిశగా అడుగులు వేస్తున్న వైసీపీ కౌన్సిలర్లు..!



తిరువూరు, ఆంధ్రజ్యోతి: స్థానిక మున్సిపాలిటీలో చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టే దిశగా కొందరు వైసీపీ కౌన్సిలర్లు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నట్టు సమాచారం. ఈ మార్చి 18 నాటికి పాలవర్గం ఏర్పడి నాలుగేళ్లు పూర్తి కావస్తుండటంతో అసమ్మతివాదులు తమ తమ ప్రయత్నాలకు తెరతీశారు. కొద్దిరోజులుగా కొందరు కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టేందుకు సభ్యుల్ని సమీకరించుకునే పనిలో పడ్డారు. కొందరు సభ్యులు న్యాయనిపుణుల సలహాలు తీసుకుంటున్నారు. అవసరమయితే ప్రతిపక్షమైన టీడీపీ సభ్యుల మద్దతు పొందేందుకు, కొందరు పెద్దలు రంగంలోకి దిగుతున్నట్టు తెలుస్తోంది. మున్సిపాలిటీలో 20 వార్డులకు 17 వార్డులు వైసీపీ దక్కించుకోగా, టీడీపీ 3 వార్డులకే పరిమితమైంది. వైసీపీ ఎక్కువ స్థానాలు సాధించినా, చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికలు వివాదస్పదమయ్యాయి. మున్సిపల్ చైర్మన్‌గా స్థానిక అధిష్ఠానం (అప్పటి ఎమ్మెల్యే రక్షణనిధి) సూచించిన పేరును కాదని, రాష్ట్ర పార్టీ మరో పేరును సీల్డ్ కవర్‌లో పంపింది. పార్టీ ఆదేశాలతో గత్తం కస్తూరిబాయి చైర్మన్‌గా 2021 మార్చి 18న ప్రమాణ స్వీకారం చేశారు. రెండున్నరేళ్ల తరువాత దిగిపోవాలని, తర్వాత స్థానిక నాయకత్వం సూచించిన వారు చైర్మన్‌గా బాధ్యత స్వీకరిస్తారని అప్పటి ఎమ్మెల్యే ముందుగానే కండిషన్ పెట్టారు. ఒప్పంద కాలం పూర్తవడంతో చైర్మన్ రాజీనామా అంశాన్ని వైసీపీకి చెందిన కొందరు సభ్యులు తెరపైకి తెచ్చారు. ఒప్పందం ప్రకారం దిగిపోయేందుకు ప్రస్తుత చైర్‌పర్సన్ సుముఖత చూపించకపోవడం, తనకు ఈ పదవి రాష్ట్ర పార్టీ అదిష్టానం ఇవ్వడం వల్ల వారు చెబితేనే దిగుతానంటే తేల్చి చెప్పడంతో, అప్పటి నుంచి వైసీపీ కౌన్సిలర్లు చైర్మన్‌కు ఎదురు తిరగసాగారు. బోర్డుపై విమర్శలు చేయడం, కొన్ని సమావేశాలకు గైర్హాజరవడం వంటి చర్యలతో నిరసనను వ్యక్తం చేశారు. టీడీపీ సభ్యులు సైతం సమావేశం మందిరం వద్దకు వచ్చినా కౌన్సిల్‌లోకి వెళ్లకపోవడంతో, కోరం లేక వరుసగా 2 నెలలు సమావేశాలు వాయిదాపడ్డాయి. తదుపరి కొందరు పెద్దల జోక్యంతో సమావేశాలకు హాజరౌతున్నా అసమ్మతిని మాత్రం వినిపిస్తున్నారు. ఇప్పటికే వైసీపీకి చెందిన 17 మంది కౌన్సిలర్లలో 8 మంది సభ్యులు చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధమవుతూనే, అవిశ్వాసానికి అవసరమైన మద్దతు సమీకరించే ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా ప్రస్తుతం వైసీపీ ఇన్‌చార్జిగా ఉన్న నల్లగట్ల స్వామిదాసు, నాటి ఒప్పందాలు తనకు తెలియవని, ఈ వివాదాస్పద అంశానికి దూరంగా ఉన్నట్టు తెలుస్తుంది.



కౌన్సిల్‌లో పాల్గొన్న సభ్యులు (ఫైల్ ఫొటో)



రహదారుల అభివృద్ధితో

గుడివాడకు కొత్త హంగులు

- ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రహదారుల అభివృద్ధికి తోడ్పాటునందిస్తున్న మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నానని, త్వరలోనే గుడివాడలోని అన్నీ రహదారులకు ఇరువైపుల రోడ్డును విస్తరించి, డివైడర్‌లకు రంగులద్ది, నూతన టెక్నాలజీతో వీధి దీపాలు ఏర్పాటు చేస్తున్నట్టు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. శనివారం స్థానిక రాజేంద్రనగర్‌లోని ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారి 216 పరిధిలో ఉన్న గుడివాడ ప్రధాన రహదారుల ఆధునీకీకరణకు వన్‌టైం అప్రువల్‌తో కేంద్ర ప్రభుత్వం అనుమతిచ్చిందన్నారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆదేశాలతో దుమ్ము, ధూళీతో నిండి ఉండే ప్రధాన రహదారుల రూపురేఖలు మారబోతున్నాయన్నారు. ఎంపీ బాలశౌరి సహకారం ఎనలేనిదన్నారు. గుడివాడ పక్కన నుంచి గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి వెళ్లనుందన్నారు. మూడు వారాల్లో డీపీఆర్ సిద్ధం చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆదేశాలిచ్చారన్నారు. త్వరలోనే టెండర్ల ప్రక్రియ పూర్తవుతుందన్నారు. స్వచ్ఛ గుడివాడ రూపకల్పనకు సహకారం అందిస్తామని ఇప్పటికే స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి హామీ ఇచ్చారన్నారు. అడ్డగోలు పార్కింగ్, ఇష్టారీతిన తోపుడు బండ్ల వర్తకులు వ్యవహరించకుండా అధికారులతో కలిసి ప్రణాళికలను రూపొందిస్తున్నట్టు ఎమ్మెల్యే వెనిగండ్ల పేర్కొన్నారు.

ఫేక్ జాబ్ రాకెట్ పట్ల అప్రమత్తత అవసరం

- రైల్వే పీఆర్వో నుస్రత్

రైల్వే స్టేషన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రైల్వేలో ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేస్తున్న రాకెట్ పట్ల నిరుద్యోగులు అప్రమత్తంగా ఉండాలని విజయవాడ రైల్వే డివిజన్ పీఆర్వో నుస్రత్ ఎం మంద్రూపకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్‌లోని నిరుద్యోగులు తప్పుడు ప్రచారాలు చేస్తూ రిక్రూట్‌మెంట్ స్కాంలు నడుపుతున్న వారిపట్ల జాగ్రత్తగా ఉండాలని కోరారు. రైల్వేలో ఉద్యోగాల భర్తీ, రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా పక్కాగా నడుస్తాయన్నారు. ఇటీవల విద్యాధికులతో పాటు నిరుద్యోగులు కూడా దళారులు ద్వారా మోసపోతున్నారని, మోసగాళ్లు సెల్‌ఫోన్లలో, ఈ-మెయిల్స్ ద్వారా తప్పుడు సమాచారాలను పంపించి, నిరుద్యోగుల్లో ఆశ కల్పిస్తున్నారన్నారు. అభ్యర్థులతో నేరుగా మాట్లాడి తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. సీనియర్ అధికారులకు చెందిన సంతకాలను ఫోర్జరీ చేసి నియామక పత్రాలు కూడా ఇస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని రైల్వే డివిజన్ ఉన్నతాధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఇటీవల డివిజన్ కమర్షియల్ విభాగంలో ఉద్యోగం ఉందంటూ ఒక మహిళను మోసగించి రూ.9లక్షలు కాజేసిన వైనం ఉందన్నారు. రైల్వే ఉద్యోగాల నియామక ప్రక్రియలో మధ్యవర్తులు, ఏజెంట్ల ప్రమేయం అస్సలు ఉండదన్నారు. నిరుద్యోగులు ఉద్యోగావకాశాల ప్రకటనలను నిజమైనవా, కావా అని పరిశీలించుకోవాలన్నారు. ఏ సమాచారం ఇవ్వటానికైనా అధికారులు సిద్ధంగా ఉంటారన్నారు.

నియంత్రణలేని ట్రాఫిక్‌తో అవస్థలు

- ఫోన్ కబుర్లలో మునిగిన పోలీసులు
- వాహనాల మధ్య ఇరుక్కుపోయిన భక్తులు

ఉయ్యూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): వీరమ్మతల్లి తిరునాళ్ల సందర్భంగా ట్రాఫిక్‌లో ఇరుక్కుని భక్తులు, ప్రజలు ఇబ్బంది పడుతుంటే బందోబస్తు కోసం వచ్చిన పోలీసులు ఫోన్లలో మాట్లాడుకోవటం, ఇద్దరు ముగ్గురు కలిసి కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేస్తున్నారు. అమ్మవారి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తున్నారు. ఈ నేపథ్యంలో పట్టణం నుంచి విజయవాడ వైపు వెళ్లే వాహనాలను కాటూరు రోడ్డు మీదుగా గండిగుంట వైపు సర్వీసు రోడ్డు, జాతీయరహదారి వైపు మళ్లించారు. అలాగే విజయవాడ వైపు నుంచి వచ్చే వాహనాలు జాతీయరహదారి పై ఓవర్ నుంచి కాటూరు రోడ్డు మీదుగా రింగ్ సెంటర్‌కు చేరుకుంటున్నాయి. ఈ క్రమంలో కాటూరు రోడ్డులో సెంటర్ పార్కింగ్‌తో పాటు ఇరువైపులా వాహనాలు, ఆటోలు పెద్ద ఎత్తున అడ్డదిడ్డంగా నిలపడంతో రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. ఈ ట్రాఫిక్‌ను కంట్రోల్ చేయాల్సిన పోలీసులు పట్టించుకోకుండా ఫోన్లు, కబుర్లలో మునిగిపోవడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి తిరునాళ్ల చివరిరోజుల్లో అధికంగా వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ట్రాఫిక్‌లో ఇరుక్కుని ఇబ్బందులు పడుతున్న భక్తులు, ప్రజలు



ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్

వ్యర్థాల నుంచి సంపద

- చీఫ్ సెక్రటరీ విజయానంద్

పాయకాపురం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఇంటి వద్దనే వ్యర్థాలను వేరు చేసి సంపదను సృష్టించాలని తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి వాటిని రీసైకిల్ చేసేలా అందరూ సహాయపడాలని చీఫ్ సెక్రటరీ కే విజయానంద్ కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో రాజీవ్‌నగర్ సెంటర్‌లో శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి కే విజయానంద్ వాక్‌థాన్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఇంటి వద్దనే వ్యర్థాలు వేరు చేసే ప్రక్రియను అవగాహన కల్పించేలా నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. దోమ కాటుతో ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా ఫాగింగ్, స్ప్రేయింగ్, డ్రోన్ స్ప్రేయింగ్, యాంటి లార్వా ఆక్టివిటీస్ చేసే స్టాళ్లను సందర్శించారు. అనంతరం వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ తడి చెత్త, పొడి చెత్త, హానికరమైన వ్యర్థాలకు 3 రంగుల బుట్టలను వీఎంసీ అందిస్తోందన్నారు. అలాగే ప్రతి ఇంటి వారు వ్యర్థాలను వేరు చేసి చెత్తను ఇవ్వాలన్నారు.

పన్ను చెల్లింపు దేశభక్తితో సమానం

- ఇన్‌కమ్ ట్యాక్స్ చీఫ్ కమిషనర్ వరీందర్ మెహతా

వన్‌టౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పన్నులు చెల్లించటం దేశభక్తితో సమానమని, దేశానికి సేవ చేయాలన్న సంకల్పంతోనే పన్నులు చెల్లించాలని ఆదాయపు పన్ను చీఫ్ కమిషనర్ వరీందర్ మెహతా అన్నారు. అంతర్జాతీయ కస్టమ్స్ దినోత్సవం శనివారం తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి వెలిగించి సభను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ దేశం శక్తివంతంగా ఎదగాలంటే ప్రతి ఒక్కరూ పన్నులు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. గౌరవ అతిథి రైల్వే డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్ మాట్లాడుతూ కస్టమ్స్ ఉద్యోగులు దేశ భవిష్యత్తుకు దశ, దిశ నిర్దేశకులని ప్రశంసించారు. కస్టమ్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి మాట్లాడుతూ విజయవాడ కస్టమ్స్ కమిషనరేట్ పరిధిలో రూ.11,480 కోట్లు వసూలు సాధించి లక్ష్యానికి చేరువలో ఉన్నామన్నారు. ఈ సందర్భంగా ఏపీ అవయవదాతల అసోసియేషన్ వ్యవస్థాపకురాలు గూడూరు సీతామహాలక్ష్మిని, తమ అవయవాలను దానం చేస్తామని ప్రతిజ్ఞ చేసిన 36 మంది కస్టమ్స్ ఉద్యోగులను ఈ సందర్భంగా సత్కరించారు. కస్టమ్స్ అదనపు కమిషనర్లు కాకరాల ప్రశాంత్ కుమార్, జి.రామకృష్ణరాజు యాదవ్, అబ్దుల్ అజీమ్, వేణు పాల్గొన్నారు.

లక్ష్య నిర్దేశంతోనే జీవితంలో రాణింపు

- సినీ నటుడు రాజేంద్ర ప్రసాద్



వన్‌టౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యా న్ని ఏర్పరచుకుని దాన్ని సాధించినప్పుడు జీవితంలో మంచిస్థాయికి ఎ దుగుతారని, రాణిస్తారని ప్రముఖ సినీ నటుడు రాజేంద్ర ప్రసాద్ అన్నారు. శనివారం కొత్తపేటలోని పొట్టిశ్రీరాములు చలువాది మల్లికార్జునరావు కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ 17వ వార్షికోత్సవం ఆ కాలేజీ ప్రాంగణంలో జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన నటుడు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు తాము ఎంచుకున్న రంగాల్లో మంచి స్థాయి లభించే వరకు పాటుపడాలన్నారు. తాను 48ఏళ్లుగా సినిమా రంగంలో రాణించటం అందరి ఆశీర్వచనాలతో పాటుగా కృషి సైతం దాగుందన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ప్రముఖ మిమిక్రీ ఆర్టిస్టు భవిరి రవి, కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు చలువాది మల్లికార్జునరావు, చిట్టా అమర సుధీర్ కళాశాల కమిటీ ఉపాధ్యక్షుడు సి.హెచ్.ఆనంద్ సుధాకర్, పి.సురేంద్ర కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శరవణ కుమార్, కళాశాల కమిటీ ప్రముఖులు గ్రంధి సందీప్, శేగు రామకృష్ణ, ఆర్.దత్త సుబ్బారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్‌ను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

వంశీకి ప్రాణహాని ఉంది

- వల్లభనేని పంకజశ్రీ

విజయవాడ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): జైలులో వల్లభనేని వంశీకి ప్రాణహాని ఉందని ఆయన సతీమణి పంకజశ్రీ వ్యాఖ్యానించారు. విజయవాడ గాంధీనగర్‌లోని జిల్లా కారాగారంలో ఉన్న ఆయనను ఆమె కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. "వంశీని అనేక రకాలుగా ఇబ్బంది పెడుతున్నారు. ఆయనను మెంటల్‌గా టార్చర్ పెడుతున్నారు. వంశీ ఉన్న బ్యారక్‌లో 60 సీసీ కెమెరాలు పెట్టారు. ఆయన ఆరోగ్యం బాగుందంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. వంశీ శ్వాస సమస్యతో బాధపడుతున్నారు. ఈ వ్యవహారంపై కోర్టుకు వెళ్తాం. నేరం రుజువు కాకుండానే బంధించారు. వంశీపై తప్పుడు కేసులు పెట్టారు. వైఎస్ జగన్ ఫోన్ చేసి ధైర్యం చెప్పారు. వైసీపీ అన్ని రకాలుగా అండగా ఉంది" అని చెప్పారు.

వారానికి రెండు ములాఖత్‌లు

వల్లభనేని వంశీని ఆయన సతీమణి పంకజశ్రీ, ఆయన సోదరుడు, మేనకోడలు జైలులో ములాఖత్‌లో శనివారం కలిశారు. సుమారుగా 40 నిమిషాలు న్యాయపరంగా వేయాల్సిన అడుగులపై వంశీ వారితో చర్చించినట్టు సమాచారం. కుటుంబ సభ్యులను కలవడానికి ఆయనకు వారానికి 2 ములాఖత్‌లను జైలు అధికారులు ఇచ్చారు.

గీతామందిరంలో విగ్రహాల ప్రతిష్ఠ

పమిడిముక్కల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : మంటాడలో పునర్నిర్మించిన గీతా మందిరంలో శనివారం విఘ్నేశ్వర, ఆంజనేయస్వామి, సాయిబాబా, నాగదేవత విగ్రహాల ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, మహాశాంతి హోమం, పూర్ణాహుతి, కలశ ఉద్వాసన జరిపారు. అనంతరం శ్రీకృష్ణ- రుక్మిణీ కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కల్యాణాన్ని తిలకించారు.


మంటాడ గీతా మందిరంలో శ్రీకృష్ణ-రుక్మిణీ కల్యాణం

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

● డ్వామా పీడీ బి.శివప్రసాద్‌యాదవ్
● వాడవాడలా స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్

పామర్రు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యకర వాతావరణం సాధ్యమవుతుందని నియోజకవర్గ ప్రత్యేక అధికారి, డ్వామా పీడీ బి.శివప్రసాద్‌యాదవ్ అన్నారు. స్వచ్ఛాంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని పట్టణంలోని రైతుబజారు, ఓల్డ్ ఆర్ అండ్ బీ బంగ్లా ప్రాంతంలో నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రం చేశారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో కె.జ్యోతి, మండల ప్రత్యేక అధికారి ఫణి ధూర్జటి, గ్రామసచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.


పామర్రు రైతుబజార్లో స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛదివస్‌లో డ్వామా పీడీ శివప్రసాద్ యాదవ్,ఇతర అధికారులు


ఆసుపత్రి ఆవరణలోని చెత్త, పిచ్చిమొక్కలను తొలగిస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్

ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో ..

గుడివాడ: స్థానిక అన్నే నరసింహరావు ఏరియా ప్రభుత్వాసుపత్రిలో శనివారం ఆసుపత్రి సూపరిటెండెంట్ ఇందిరాదేవి ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వమించారు. సూపరిటెండెంట్ ఇందిరాదేవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పరిసరాలను శుభ్రత పాటిస్తామని, చెత్త, పిచ్చమొక్కలను తొలగించామన్నారు. స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించి పరిశుభ్రతపై అవగాహన కలిగించారు. అభివృద్ధి కమిటీ సభ్యులు, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


రామన్నపూడిలో తడి, పొడి చెత్త వేరు చేయిస్తున్న ఒకేషనల్ అధికారి సాల్మన్ రాజు

రామన్నపూడిలో..

గుడివాడ రూరల్ : మండలంలో స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమం అన్ని గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేక అధికారి, ఒకేషనల్ అధికారి సాల్మన్ రాజు అన్నారు. రామన్నపూడిలో సంపద సృష్టి కేంద్రాన్ని పరిశీలించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. రామన్నపూడి పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీడీవో బి..వై.విష్ణుప్రసాద్, కార్యదర్శి కె.అనూల, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు తదిరతులు పాల్గొన్నారు.

యలమర్రు జడ్పీ పాఠశాలలో..

పెదపారుపూడి : స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్‌లో భాగంగా యలమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తడి, పొడి చెత్తలను వేర్వేరుగా అందించడంపై మండల ప్రత్యేకాధికారి, జిల్లా హ్యాండ్ లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ శాఖ సహాయ సంచాలకులు సాయి ప్రసాద్ అవగాహన కల్పించారు. ఎంపీడీవో సీతామహాలక్ష్మీ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే స్వచ్ఛత పట్ల అవగాహన అవసరమన్నారు. చెత్తను సక్రమంగా నిర్వహించకపోవటం అనేక రుగ్మతలకు కారణమవుతుందన్నారు ఈవోపీఆర్డీ వంగా శ్రీనివాస్ విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, ఫిజి కల్ డైరెక్టర్ నాగ సోమేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి చైతన్య శ్రీనివాసరావు, వెలుగు సీసీ రత్నకుమారి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కపిలేశ్వరపురంలో..

పమిడిముక్కల : స్వచ్ఛాత దివస్ కార్యక్ర మంలో భాగంగా శనివారం కపిలేశ్వరపురంలో శనివారం అధికారులు పర్యటించి పరిసరాల పరిశుభ్రత, తడి పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇళ్ల నుంచి చెత్త సేకరించేప్పుడు తడి, పొడి చెత్త, ప్రమాదకర వ్యర్థాలు వేర్వేరుగా సేకరించాలని ఎంపీడీవో డి.వెంకటేశ్వరరావు, సెక్రటరీ ప్రసాద్ సూచించారు.

నందివాడ మండలంలో..

నందివాడ : మండలంలోని నందివాడ, జనార్ధనపురం, పుట్టగుంట, కుదరవల్లి, ఇలపర్రు, పోలుకొండ పలు గ్రామాల్లో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పుట్టగుంట జిల్లా పరిషత్ పాఠశాలలో ఎంపీడీవో మల్లేశ్వరి, ఈవోపీఆర్డీ అమీర్‌బాషా పారిశుధ్యంపై అవగాహన కల్పించి, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. పంచాయతీ కార్యదర్శులు విమలకుమారి, సందీప్, కె.సురేష్, ఉషారాణి, గ్రామస్థులు పాల్గొన్నారు.


పుట్టగుంట జిల్లా పరిషత్ పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో మల్లేశ్వరి, ఇతర అధికారులు


సుబ్బారావు మృతదేహానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నేత ముప్పాళ్ల నాగేశ్వరరావు

సుబ్బారావు మృతి తీరనిలోటు

● సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

గుడివాడ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : విద్యావికాస్ విద్యాసంస్థల వ్యవస్థాపక డైరెక్టర్ ముప్పాళ్ల సుబ్బారావు మృతి తీరని లోటని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే ముప్పాళ్ళ నాగేశ్వరరావు అన్నారు. బైపాస్‌రోడ్డులోని విద్యావికాస్ పాఠశాలలో ముప్పాళ్ల సుబ్బారావు భౌతికకాయాన్ని శనివారం ఆయన సందర్శించి ఘన నివాళులర్పించారు. ముప్పాళ్ల కుటుంబసభ్యులను, పాఠశాల డైరెక్టర్ కొమ్మినేని సాంబశివరావులను పరామర్శించారు. సుబ్బారావ సీపీఐ సానుభూతిపరునిగా అనేక కార్యక్రమాలకు చేదోడు వాదోడుగా నిలిచారన్నారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థి గెలుపు కోసం కృషి చేశారని గుర్తు చేశారు. ఎంతో మందికి విద్యను అందించి ఉన్నత స్థితికి దోహదపడ్డారన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి చింతలూరి సత్యనారాయణ, నాయకులు సి.సాంబశివరావు, ముసునూరి పూర్ణచంద్రరావు, బండారుపల్లి శ్రీనివాసరావు, నండూరి పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

రేడియో అనౌన్సర్ ఆనంద్ మృతి బాధాకరం

గుడివాడ, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి) : సుదీర్ఘ కాలం విజయవాడ ఆకాశవాణిలో రేడియో అనౌన్సర్‌గా సేవలందించిన ఏబీ ఆనంద్ మృతి బాధాకరమని పట్టణ సాహితీ మిత్రులు నిర్వాహకులు, ప్రముఖ కవి వసుధ బసవేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. ఎ.బి ఆనంద్‌గా సుపరిచితుడైన ఆరుమళ్ల బ్రహ్మానందరెడ్డి రేడియో కార్యక్రమాల ప్రయోక్తగా, నటుడిగా, ఆధ్యాత్మిక వక్తగా పేరుగాంచి శ్రోతల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. కళారంగానికి ఆయన లేని లోటు తీర్చలేనిదని కవి వసుధ ఆవేదన వ్యక్తం చేశారు.

మోటూరు చేపల చెరువు వేలంపాట 18న

గుడివాడ రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : మోటూరు చేపల చెరువులో చేపలు పట్టుకు నేందుకు ఈ నెల 18వ తేదీన మోటూరు పంచాయతీ కార్యాలయం వద్ద బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి జనార్ధనరావు తెలిపారు. ఆసక్తి ఉన్న వారందరూ రూ.10 వేలు డిపాజిట్ చేసి పాటలో పాల్గొనాలని తెలిపారు. పాటదారు చెరువులో ఉన్న చేపలను పట్టుకుని చెరువును వదిలేయాల్సి ఉంటుందని తెలిపారు.

పేదలకు అన్నదానం

గుడివాడ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : చిన్నారి జక్కంపూడి ఓజస్వినీ పుట్టినరోజును పురస్కరించుకుని పేదలకు భోజనవసతి కల్పించిన కుటుంబ సభ్యులకు బీజేపీ టూటౌన్ అధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ(ఆర్.కె) అభినందనలు తెలిపారు. అన్నక్యాంటీన్‌లో చిన్నారి ఓజస్వినీ పుట్టినరోజు సంద ర్భంగా పేదలకు భోజన వసతి కల్పించారు. బీజేపీ నాయకులు బోనం గోపిక, పండు, లంకా రాంబాబు, గాదె కిరణ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు

ఉయ్యూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : డ్యూటీ చార్ట్ కౌన్సెలింగ్‌లో డిపో మేనేజర్ పక్షపాత, మొండివైఖరికి నిరసనగా నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికు లు శనివారం రెండో రోజు రిలేదీక్ష కొనసాగించారు. అసోసియేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, డీకే రావు రిలే దీక్షను ప్రారంభించారు.

ప్రజలకు స్నేహ పూర్వక సేవలు అందించాలి

● డీఎస్పీ ధీరజ్ వినీల్

గుడివాడ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు పోలీసులు జవాబుదారీగా వ్యవహరించాలని, స్నేహభావంతో మెలగాలని డీఎస్పీ ధీరజ్ వినీల్ అన్నారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ఎస్సై ప్రసారావుకు సూచనలు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు మెరుగైన సేవలను అందించేందుకు ఎల్లప్పుడు పోలీసులు అందుబాటులో ఉండాలన్నారు. లారీలను రహదారుల వెంబడి నిలుపకుండా చర్యలు తీసుకోవాలన్నారు. లారీ స్టాండ్‌కు లారీలను తరలించేలా చూడాలన్నారు. ఆటో కార్మికులతో సమావేశం ఏర్పాటుచేసి సూచనలు చేశామన్నారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారును ఉపయోగించే వారు సీటు బెల్టును పెట్టుకోవాలన్నారు. వేగం కంటే ప్రాణాలు మిన్న అనే విధంగా వాహనాలను నడపాలన్నారు. గంజాయి రహిత డివిజన్‌గా గుడివాడను నిలుపుతామన్నారు. ఫిర్యాదు చేసేందుకు వచ్చే వారితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. ట్రాఫిక్ ఏఎస్సై భాగ్యవతి, రత్నరాజు, శంకరరావు, సిబ్బంది పాల్గొన్నారు.


ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ ధీరజ్

రైతు విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలి

గుడివాడ రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రైతులు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు త్వరగా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారిణి బోలెం అనంతలక్ష్మి అన్నారు. శనివారం ఏవో వివిధ రైతు సేవా కేంద్రాలను పరిశీలించారు. రైతు విశిష్ట గుర్తింపు కార్డు ప్రతి రైతుకు తప్పనిసరి అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు అన్నీ గుర్తింపు కార్డు ఉన్న వారికే అందజేస్తామన్నారు అభివృద్ధి, సంక్షేమం అన్ని పథకాలు గుర్తింపు కార్డు ద్వారా జరుగుతాయని ఆమె వివరించారు.



ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటిని గెలిపిద్దాం

మచిలీపట్నం పార్లమెంట్ జనసేన సమన్వయకర్త బండి రామకృష్ణ

గుడివాడ, ఫిబ్రవరి15 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలని మచిలీపట్నం పార్లమెంట్ జనసేన సమన్వయకర్త బండి రామకృష్ణ పిలుపునిచ్చారు. ఆంజనేయపేటలోని జనసేన నియోజకవర్గ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ నెల 27వ తేదీన జరుగు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటిని గెలిపించడానికి జనసేన శ్రేణులు పూర్తి సహాయసహకారాలు అందించాలని కోరారు. జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ మాట్లాడుతూ శ్రేణులు పూర్తి బాధ్యతగా మద్దతుగా నిలిచి నియోజకవర్గం నుంచి అత్యధిక మెజార్టీ వచ్చేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. జనసేన నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బండి రామకృష్ణ

పమిడిముక్కల : కృష్ణా, గుంటూరు పట్ట భద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా పోటీలో ఉన్న కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజారిటీలో గెలిపించుకోవాలని ఎన్నికల పరిశీలకుడు ఎస్ విజయ్‌కుమార్ అన్నారు ఆలపాటి విజయాన్ని కాంక్షిస్తూ స్థానిక కూటమి నాయకులతో కలసి శనివారం మంత్రివాడలో ప్రచారం చేశారు. టీడీపీ సీనియర్ నాయకుడు జక్కా శ్రీనివాసరావు, కె.ప్రవీణ్‌చంద్, మైనేని ఇందిర, వై.రాజేంద్రప్రసాద్, బాబూరావు, బాబ్జి, మైనేని నరేంద్ర పాల్గొన్నారు.


మంత్రివాడలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

సంక్షేమ పథకాల అమలు బాధ్యత అంగన్వాడీలదే

పామర్రు,ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అమలు చేసే బాధ్యత అంగన్వాడీ కార్యకర్తలదేనని జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి, పామర్రు మండల ప్రత్యేక అధికారి ఫణి దూర్జటి అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తలకు చిన్నారుల సంరక్షణ, పోషకాహారం అంశంపై శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి శనివారం ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఆరోగ్య వంతమైన సమాజ నిర్మాణ సాధన కోసం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పథకాలను పట్ల ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. బాల్య వివాహాలను నిరోధించే చర్యలను వివరించాలన్నారు. ఎంఈవో పద్మవాణి చిన్నారుల పోషణ చర్యలను తెలియజేశారు. పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీడీవో కె.జ్యోతి, అంగన్వాడీ పర్యవేక్షకులు ఎస్. విజయకుమారి, ఎన్.సత్యశ్రీ, అరుణకుమారి, ఎంఈవో గుమ్మడి పద్మవాణి, ప్రధానోపాధ్యాయురాలు ఆలపాటి ఇందిర, పంచాయతీ విస్తరణాదికారి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.


పామర్రు జడ్పీ స్కూల్‌లో జరిగిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి ఫణి ధూర్జటి

వానపాముల జడ్పీ పాఠశాలలో..

పెదపారుపూడి : వానపాముల జిల్లా పరిషత్ పాఠశాలలో సూపర్‌వైజర్లు ఎం.శివనాగమణి, జి.అరుణకుమారిల ఆధ్వర్యం లో పోషణ్ బి - పడాయి బి మూడు రోజుల శిక్షణ కార్యక్రమం జరిగింది. దివ్యాంగ పిల్లలను ముందుగానే, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని వివరించారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రాన్ని అభ్యాస కేంద్రంగా చేయాలని పిలుపునిచ్చారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు.


వానపాముల జడ్పీ పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తల ప్రతిజ్ఞ

నందివాడ జడ్పీ పాఠశాలలో..

నందివాడ : నందివాడ జిల్లా పరిషత్ పాఠశాలలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు బి.కెడి.భవాని, ఎన్.నాగ శిరీష ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న అంగన్‌వాడీ శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. సీడీపీవో విజయ ఫ్లోరెన్స్ మాట్లాడుతూ పోషకాహార లోపం ఉన్న పిల్లలను గుర్తించి తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. చిన్న పిల్లల పెరుగుదలకు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.


నందివాడలో శిక్షణ కార్యక్రమంలో సీడీపీవో విజయ ఫ్లోరెన్స్

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	120, 129, 140
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.450

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో మంత్రి రవీంద్ర



మోపిదేవి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని మంత్రి కొల్లు రవీంద్ర శనివారం దర్శించుకున్నారు. నాగపుట్టలో పాలు పోసి స్వామి వారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. అర్చక బృందం వేదమంత్రాలతో ఆశీర్వచనం పలికి శేషవస్త్రాలతో సత్కరించి స్వామివారి చిత్రపటం ప్రసాదాలు మంత్రికి అందజేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు నడకుదుటి జనార్దనరావు, పార్టీ నాయకులు రావి నాగేశ్వరరావు, రావి రత్నగిరి, బల్లా సీతారామ ప్రసాద్, కనకయ్య ఉన్నారు.



అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ





మిద్దెతోట పెంపకందారు సౌదామిని, నందినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ



చల్లపల్లి జడ్పీహైస్కూల్‌లో ప్రతిజ్ఞ చేయిస్తున్న డిప్యూటీ సీఈవో ఆనందకుమార్

స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రకు కృషి చేయాలి

మచిలీపట్నం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రకు అందరూ కృషి చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. పరిసరాల శుభ్రత, తడి, పొడిచెత్త వేరు చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించే అంశంపై ఉద్యోగులతో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. డీఆర్వో కె.చంద్రశేఖరరావు, మచిలీపట్నం ఆర్డీవో కే స్వాతి, కలెక్టరేట్ ఏవో వీరాంజనేయులు, వివిధశాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మిద్దెతోట పెంపకందారులకు అవార్డుల ప్రదానం

మచిలీపట్నం టౌన్ : మిద్దె తోటలు పెంచుతున్న సౌదామని, నందినీ అందరికీ ఆదర్శమని, వారిని స్ఫూర్తిగా తీసుకుని స్వచ్ఛ బందరును రూపొందిద్దామని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. మచిలీపట్నంలో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం కింద గొడుగుపేటలోని చుండూరు సౌదామిని, మలకాపట్నానికి చెందిన తన్నీరు నందిని మిద్దె తోటలను ఆయన పరిశీలించి స్వచ్ఛ మచిలీపట్నం అవార్డులను అందజేశారు. మన చెత్త- మన ఎరువు- మన మొక్క - మన బాధ్యత నినాదంతో అందరూ కలిసి పనిచేయాలన్నారు. బందరు ఆర్డీవో కె స్వాతి, మునిసిపల్ కమీషనర్ బాపిరాజు తదితరులు పాల్గొన్నారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద జరిగిన ర్యాలీలో ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌తో పాటు భగత్‌సింగ్ నాయక్, నిరంజన్, వైద్యులు, నర్సులు పాల్గొన్నారు. ఆసుపత్రి ఆవరణను శుభ్రం చేశారు.డీవైఈవో శేఖర్‌సింగ్, ఎంఈవో దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. నగరశివారు నవీన్‌మిట్టల్ తదితర ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ ఎదురుగా మెయిన్‌రోడ్డులలో వీధులను మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, సీనియర్ టీడీపీ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ చీపుళ్ల పట్టి శుభ్రం చేశారు. కుంచే నాని, పి.వి. ఫణికుమార్‌తో పాటు ఈశ్వర్ రెసిడెన్సీ అధినేత వేమూరి ఈశ్వర్ పాల్గొన్నారు. **బంటుమిల్లి** : బంటుమిల్లి కాలనీలో జడ్పీ సీఈవో కన్నమ్మ నాయుడు స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో పాల్గొన్నారు. తడి పొడి చెత్త వేరు చేయడం, సంపద సృష్టిపై ప్రజలకు అవగాహన కల్పించారు. మండల ప్రత్యేక అధికారి చంద్రశేఖర్, ఎంపీడీవో శైలజ కుమారి, పంచాయతీ కార్యదర్శి ఝాన్సీలక్ష్మీ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. **పెడన** : కమిషనర్ మన్నం గోపాలరావు శనివారం పట్టణంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. పారిశుద్యం మెరుగుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు.



బందరు ప్రభుత్వాసుపత్రి వద్ద స్వచ్ఛాంధ్ర ర్యాలీ



పరిసరాలను శుభ్రం చేస్తున్న తహసీల్దార్ శ్రీనునాయక్



ఘంటసాలపాలెంలో స్వచ్ఛాంధ్ర ర్యాలీ

శానిటరీ ఇన్‌స్పెక్టర్ హరికిషోర్, శానిటరీ సెక్రటరీలు, మేస్త్రిలు, కార్మికులు పాల్గొన్నారు. జడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం అద్దంకి అశోక్‌కుమార్, పూర్వ విద్యార్థి మట్టా రాధాకృష్ణమూర్తి శనివారం మొక్కలు నాటారు. నాటిన మొక్కల సంరక్షణ కోసం ట్రీ గార్డులు ఇస్తానని రాధాకృష్ణమూర్తి హామీ ఇచ్చారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు యూనిఫాం నిమిత్తం రాధాకృష్ణమూర్తి రూ. 10వేల విరాళం అందించారు. **కోడూరు** : పరిసరాలను పరిశుభ్రం ఉంచుకోవాలని తహసీల్దార్ శ్రీను నాయక్ అన్నారు. తహసీల్దార్ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదిర్శ బండే శేషగిరిరావు ఆధ్వర్యంలో పరిసరాలను శుభ్రం చేశారు. పిచ్చిమొక్కలను తొలగించి ప్లాస్టిక్ కవర్లను ఏరివేశారు. రెవెన్యూ సిబ్బంది, సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు. **నాగాయలంక** : స్వచ్ఛ నాగాయలంక నిర్వాహకులు శ్రీరామపాదక్షేత్రం పుష్కర ఘాట్‌ను సందర్శించే భక్తులు, యాత్రికులు వినియోగించిన వ్యర్థాలను పడేసేందుకు చేపల ఆకృతిలో ఉన్న ఇనుప చెత్త బుట్టను ఒకటి ఘాట్ ప్రాంతంలో ఉంచారు. మీనాకృతి బుట్ట ఘాట్‌ను సందర్శించే వారిని ఆకట్టుకుంటోంది. **ఘంటసాల** : ఘంటసాలపాలెంలో ఈవోపీఆర్డీ వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి బొలెం అర్జునరావు ఇంటింటికి వెళ్లి స్వచ్ఛాంధ్రపై అవగాహన కల్పించారు. ర్యాలీ నిర్వహించారు. దోనె వెంకటేశ్వరరావు, గ్రామస్థులు పాల్గొన్నారు. తెలుగురావుపాలెంలో పంచాయతీ కార్యదర్శి అశ్విన్ కుమార్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. చినకళ్లేపల్లిలో పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ నయీమ్ గ్రామస్థులకు అవగాహన కల్పించి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించారు. డస్ట్‌బిన్లు అందజేశారు. చిట్టూరు గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీలక్ష్మీ కృష్ణవేణి గ్రామస్థులకు అవగాహన కల్పించి తడి, పొడి చెత్త సేకరణ నిర్వహించారు. కొడాలి గ్రామపంచాయతీలో కార్యదర్శి సిహెచ్.వి.ఎస్. నాగమణి ఆధ్వర్యంలో గ్రామస్థులకు అవగాహన కల్పించి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. ఘంటసాల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఎంపీడీవో సుబ్బారావు అంగన్‌వాడీ కార్యకర్తలకు, విద్యార్థులకు స్వచ్ఛ దివస్ గురించి అవగాహన కల్పించారు. ఘంటసాల జడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయులు చీపురు పట్టి పరిసరాలు పరిశుభ్రపరిచారు. ఎంపీడీవో మోమిన్, హెచ్‌ఎం శ్రీరంగవల్లి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. **చల్లపల్లి** : ఆరోగ్యాంధ్ర సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని జడ్పీ డిప్యూటీ సీఈవో, మండల ప్రత్యేకాధికారి ఆర్.పి. ఆనంద్ కుమార్ పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్ సందర్భంగా శనివారం చల్లపల్లిలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీడీవో ఎ.వి.రమణ, ఈవోఆర్డీ రవిశంకర్, ఈవో పివి.మాధవేంద్రరావు, హెచ్‌ఎం రమాదేవి తదితరులు పాల్గొన్నారు. మాజేరులో డిప్యూటీ సీఈవో ఆనంద్‌కుమార్, ఎంపీడీవో ఏవి.రమణ, ఈవో పిట్టి రాంబాబులు పాల్గొన్నారు. **అవనిగడ్డ రూరల్** : పులిగడ్డ గురుకుల పాఠశాలలో స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రంపై విద్యార్థులకు ఎంపీడీవో మరియదేవి అవగాహన కల్పించారు. విద్యార్థుల వసతిగృహాన్ని నిఖీ చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈవోపీఆర్డీ అరుణ కుమారి, పంచాయతీ కార్యదర్శి అనిత, ప్రిన్సిపల్ ఎస్‌టిపి.కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉప్పునీరు ఎగువకు రాకుండా ఇసుక మూటలు



అవుట్‌ఫాల్ స్లూయిస్ వద్ద ఎగువకు నీరు రాకుండా ఇసుక మూటలు వేస్తున్న ఇరిగేషన్ సిబ్బంది

కోడూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పాలకాయితిప్ప అవుట్ పాల్స్ స్లూయిస్ గేట్లు వద్ద నుంచి ఉప్పునీరు ఎగువకు రాకుండా తాత్కాలిక పనులను డ్రైనేజీ శాఖ అధికారులు చేపట్టారు. పాలకాయితిప్ప అవుట్ ఫాల్ స్లూయిస్ గేట్లు లేనందున సముద్రపు ఉప్పు నీరు దిగువ ప్రాంత భూముల్లోకి చొచ్చుకుని వచ్చి వేలాది ఎకరా లలో వేసిన వరి నాట్లు పాడైపోతున్నాయని, సాగుభూమి చౌడు భూమిగా మారుతోందని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేంత వరకు తాత్కాలిక చర్యల్లో భాగంగా ఇసుక మూటలైనా నీటి ప్రవాహానికి అడ్డంగా వేయా లని కోరుతూ ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి డ్రైనేజీ శాఖ అధికారులు స్పందించారు. శనివారం అవుట్ ఫాల్స్ స్లూయిస్‌కు ఉన్న ఐదు ఖానాల్లో నాలుగింటికి ఇసుక మూటలు అడ్డంగా వేశారు. డ్రైనేజీ శాఖ అధికారి బాబు నాయక్ మాట్లాడుతూ, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచనల మేరకు అవుట్ ఫాల్ స్లూయిస్ నిర్మాణం కోసం అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, ప్రభుత్వం నిధులు మంజూరు చేయగానే నిర్మాణం చేపడతామని తెలిపారు. తాత్కాలిక చర్యల్లో భాగంగా పాలకాయి తిప్ప అవుట్ ఫాల్ స్లూయిస్ వద్ద వేసిన ఇసుక మూటలను, ఆక్వా రైతులు, మత్స్యకారులు తొలగించరాదన్నారు. తొలగించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సాగుభూమిలోకి ఉప్పునీరు చేరకుండా నీటి ప్రవాహానికి అడ్డంగా వేసిన ఇసుక మూటలను తొలగించవద్దని కోరారు.

అనుమతులు లేకుండా చెరువు తవ్వకం

• అడ్డుకున్న మణిమేశ్వరం రైతులు

బంటుమిల్లి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : అనుమతులు లేకుండా పంట భూములను చెరువులుగా తవ్వేస్తూ మట్టిని తరలిస్తుండగా రైతులు అడ్డుకున్న సంఘటన మణిమేశ్వరం గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. లేళ్లగూడెంరోడ్డులో లంబాడికోడు మురికి కాల్వ పక్కనే చినతుమ్మిడి గ్రామానికి చెందిన మీగడ రామ తులశమ్మ సీతారామరాజులకు రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. మట్టి మాఫియాదారులతో వారు కుమ్మక్కై చెరువును తవ్వి మట్టిని పెడన తరలిస్తుండగా స్థానిక రైతులు అడ్డుకున్నారు. చెరువులు తవ్వడం వల్ల వ్యవసాయ భూములు దెబ్బతింటాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు ఆళ్ళ శ్యామలరాజు, వేముల వీరరాఘవులు మాట్లాడుతూ, చెరువు తవ్వకంతో ఇతర వ్యవసాయ భూములు దెబ్బతింటాయన్నారు. ఈ విషయాన్ని రెవెన్యూ దృష్టికి, పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని వాపోయారు. గ్రామ స్థాయి రెవెన్యూ సిబ్బంది వచ్చి చూసి వెళ్ళి పోయారు. ఇద్దరు పోలీసులు వచ్చి కూర్చుని మాట్లాడుకోండి అని సలహా ఇచ్చి వెళ్ళిపోయారు. ఇన్‌చార్జి తహసీల్దార్ పూర్ణ చంద్రరావును వివరణ కోరగా, ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని, ఉన్నతాధికారుల ఆదేశం మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



చెరువు తవ్వకాన్ని అడ్డుకుంటున్న మణిమేశ్వరం రైతులు

స్వచ్ఛతా గ్రామాలుగా తీర్చిదిద్దుదాం



కలపటంలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

గూడూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : తడి, పొడిచెత్తలను వేరు చేయడంపై అవగాహన కల్పించుకుని స్వచ్ఛత గ్రామాలుగా తీర్చిదిద్దడంలో సహకారం అందించాలని కలెక్టర్ డి.కె. బాలాజీ ప్రజలకు పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా గూడూరు మండల కేంద్రంలో తడి, పొడి చెత్తలను వేరు చేసే విధానాన్ని పరిశీలించారు. సంపద తయారీ కేంద్రం నిరుపయోగంగా ఉండటంపై కలెక్టర్ పంచాయతీ సెక్రటరీ, ఈవో ఆర్డీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ, తడి, పొడిచెత్తలను వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందజేయాలన్నారు. తడి చెత్త నుంచి ఎరువులు, వర్మి కంపోస్టు తయారు చేయడం, పొడి చెత్తను రీ సైక్లింగ్‌కు పంపిండం జరుగుతుందన్నారు. గూడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ బాలాజీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్యసేవలను పరిశీలిం చారు. ఎటువంటి ఫిర్యాదులు రాకుండా సేవలం దించాలని కలెక్టర్ బాలాజీ కోరారు. అనంతరం కలపటం గ్రామంలో రీ సర్వే ప్రక్రియను క్షేత్ర స్థాయిలో పరిశీ లించారు. కలెక్టర్ మాట్లాడుతూ, భవిష్యత్తులో ఎటువంటి భూ సమస్యలు ఉత్పన్నం కాకుండా రీ సర్వే జాగ్రత్తగా చేపట్టాలన్నారు. తహసీల్దార్ డి.రాజ్యలక్ష్మీ పాల్గొన్నారు.

అచలేశ్వర మందిర ప్రతిష్ఠా మహోత్సవాలు రేపటి నుంచి



చల్లపల్లి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : పాగోలులోని కైవల్యాశ్రమంలో మలాత్మికా సహిత అచలేశ్వర మందిర ప్రతిష్ఠామహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. పూర్తి గ్రానైట్ శిలలతో 20 అడుగుల ఎత్తున అష్టభుజి ఆకారంలో మందిర నిర్మాణం జరిగింది. ఆలయం వెలుపల ద్వాదశ జ్యోతిర్లింగాల నమూనాలను, దేవతామూర్తుల విగ్రహాలను ఏర్పాటు చేశారు. గర్భాలయంలో శ్రీచక్ర నిర్మాణం పోలిఉండేలా కమలాత్మికా సహిత అచలేశ్వరుని ప్రతిష్ఠించి, తొమ్మిది దేవతా విగ్రహాలను పీఠాలపై ప్రతిష్టిస్తారు. ఈనెల 17వ తేదీ సోమవారం మంగళతోరణం, మంగళవాయిద్యం, గోపూజతో ప్రతిష్ఠాపూజలు ప్రారంభమై 23వ తేదీ ఆదివారం వరకు జరుగుతాయని విద్యాసాగర్ స్వామి, మేనేజింగ్ ట్రస్టీ చాపరాల గాంధీప్రసాద్, ట్రస్టీ మేకా బంగారుబాబు తెలిపారు. 23వ తేదీ ఆదివారం ఉదయం గం.10.24 లకు ప్రతిష్ఠ జరుగుతుందన్నారు.

ఆర్థిక సమస్యలతో యువతి ఆత్మహత్య

చల్లపల్లి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక సమస్యలతో యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన లక్ష్మీపురం శివారు రామానగరంలో జరిగింది. పిట్టు దుర్గాపావని (26) తన తల్లి కల్యాణి, తాతతో కలిసి విజయవాడలో నివసిస్తోంది. తండ్రి అనారోగ్యంతో గతంలో మృతిచెందగా, ఇటీవలే వివాహమైన సోదరుడు ప్రభాకర్ రామానగరంలోని సొంత ఇంటిలో నివసిస్తున్నాడు. దుర్గాపావని విజయవాడలో ఫొటోగ్రఫీ నేర్చుకుంటూ ఉంటుండగా, జ్వరం రావటంతో వారం రోజుల రామానగరంలోని సోదరుడు ప్రభాకర్ ఇంటికి వచ్చింది. శుక్రవారం అన్నా, వదిన విజయవాడ వెళ్లగా చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆర్థిక సమస్యలతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకుని ఉంటుందని కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు. తల్లి కల్యాణి ఫిర్యాదు మేరకు చల్లపల్లి ఎస్సై పిఎస్‌వి.సుబ్రహ్మణ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొమ్మారెడ్డి విద్యార్థుల ప్రతిభ



బంటుమిల్లి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు భద్రతపై నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీల్లో కొమ్మారెడ్డి హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపి కలెక్టర్ డీకే బాలాజీ చేతుల మీదుగా శనివారం సర్టిఫికెట్లు అందుకున్నారు. వ్యాసరచన పోటీల్లో ఎ.హన్సిశ్రీ, భావన, క్విజ్ పోటీల్లో లాస్య, సిహెచ్ లిఖితశ్రీ, చిత్రలేఖనంలో ఎస్.గీతాకా ప్రియ, కె.మౌక్తిక ప్రతిభను చాటారు. స్కూల్ డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్, కరస్పాండెంట్, సెక్రటరీ శోభ, హెచ్ ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు విజేతలను అభినందించారు.

జాతీయ కాపు సంఘం లీగల్ సెల్ అధ్యక్షుడిగా బాలాజీ



మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : జాతీయ కాపు సంఘం లీగల్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రముఖ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ నియమితులయ్యారు. జాతీయ కాపు సంఘం వ్యవస్థాపకుడు కె.మురళీకృష్ణ నాయుడు ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. తనపై విశ్వాసంతో పదవి ఇచ్చినందుకు మురళీకృష్ణకు బాలాజీ ధన్యవాదాలు తెలిపారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నేత్ర పరీక్షలు

చల్లపల్లి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత నేత్ర పరీక్షా శిబిరం జరిగింది. సజ్జా ప్రసాద్ ఆర్థిక సహకారంతో జరిగిన శిబిరంలో డాక్టర్ వెంకట్రావ్ 40 మందిని పరీక్షించి ఏడుగురిని ఐఓఎల్ శస్త్రచికిత్సలకు ఎంపికచేశారు. సాయిబాబు, కస్తూరి వెంకట వరప్రసాద్, ముమ్మనేని నాని, వెంకటేశ్వరరావు, చంద్రశేఖరరావు పర్యవేక్షించారు.

లక్ష్మణరావును గెలిపించాలి

అవనిగడ్డ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కె.ఎస్.లక్ష్మణరావు, ఉభయ గోదావరి, ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్థులకు తమ యొక్క ఓటు వేసి గెలిపించాలని వివిధ జిల్లాల నుంచి వచ్చిన డీఎస్సీ అభ్యర్థులను ప్రజాసంఘాల నేతలు ఓట్లు అభ్యర్థించారు. శనివారం వారిని ప్రత్యేకంగా కలసి ఓటు వేయాలని కోరారు. డీవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామన్న, జిల్లా కౌలు రైతు సంఘం కార్యదర్శి పి.రంగారావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పోలి నాయుడు పాల్గొన్నారు.

రీ సర్వే విధానం తనిఖీ

నాగాయలంక, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రేమాలవారిపాలెంలో రీ సర్వే విధానాన్ని జిల్లా సర్వే, భూమి రికార్డుల అధికారి ఎం.జోషి తనిఖీ చేశారు. సర్వే ప్రక్రియ వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. తహసీల్దార్ ఎం.హరనాథ్‌కు పలు సూచనలు చేశారు. రీ సర్వే డీటీ రఫీ, సర్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ విజయవర్మ, మండల సర్వేయర్ రామకృష్ణ బాబు, గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్జీరంగా విశ్వవిద్యాలయం అధికారుల కేవీకే సందర్శన

ఘంటసాల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఘంటసాలలోని కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివనారాయణ, పరిశోధన సహ సంచాలకులు డాక్టర్ ఎన్.వి.వి.ఎస్.దుర్గా ప్రసాద్ శనివారం సందర్శించారు. కిసాన్ మేళా ఏర్పాట్లను సమీక్షించి సూచనలు చేశారు. స్వచ్ఛతా కార్యక్రమాన్ని నిర్వహించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ డి.సుధారాణి, డాక్టర్ వి.సత్యప్రియ లలిత తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి క్యాలెండర్ ఆవిష్కరణ

అవనిగడ్డ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి-2025 క్యాలెండర్‌ను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ శనివారం ఆవిష్కరించారు. షేక్ బాషా, అబ్దుల్ గఫార్, మెహబూబ్ సుభాని, షేక్ నాగుల్ మీరా, షేక్ ఫిరోజ్, షేక్ సత్తార్, షేక్ సిద్ధిక్, షేక్ మస్తాన్, సయ్యద్ రెహ్మాన్ జానీ తదితరులు పాల్గొన్నారు.